


RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in








EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:110 WEDNESDAY ,SEPTEMBER 30,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :110 బుధవారం, సెప్టెంబర్ 30, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


# నేడే సిరిసిల్లకు సీఎం రేవంత్ రెడ్డి రాక
# మహా బహిరంగ సభకు సర్వం సిద్ధం

**తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్:**తెలంగాణ రాజకీయ చరిత్రలో రాజన్న సిరిసిల్ల నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుసగా ఐదుసార్లు గెలిచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ గులాబీ కంచుకోటలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన భారీ బహిరంగ సభ నేడు రాష్ట్ర రాజకీయాలను ఒక కుదుపు కుదుపనుంది. గతంలో అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా ప్రకటించినట్లుగానే... సిరిసిల్ల గడ్డపై మూడు రంగుల జెండా పాతుతామన్న శపథానికి అనుగుణంగా ఈ సభ రూపుదిద్దుకుంది. అసలేం జరుగుతోంది సిరిసిల్లలో? ఎందుకు ఈ భారీ బహిరంగ సభ? కేటీఆర్ అడ్డాలో రేవంత్ రెడ్డి వ్యూహం ఏమిటి? అంటూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇప్పుడు ఇదే అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. **మిగతా2లో**





## చమురు ధర 100 డాలర్లు దాటింది ఇక పరుగులు పెట్టనున్న ద్రవ్యోల్బణం

**తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్**

7 నెలలగా పశ్చిమాసియా యుద్ధం కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో క్లిష్ట పరిస్థితులతో చమురు ధరలు వంద డాలర్లకు పైగా నమోదవుతున్నాయి. భారత్‌పై ప్రభావం పడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. 7 నెలలగా కొనసాగుతున్న పశ్చిమాసియా యుద్ధంతో హర్మూ జ్ జలసంధి వద్ద నెలకొన్న క్లిష్ట 2



# ఒప్పించండి ఇప్పించండి

**పీఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులివ్వండి**

**కృష్ణా జలాల వినియోగంపై త్వరగా టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి**

**జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు రేవంత్ వినతి**

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:**తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని 2లో



# నిరుద్యోగులకు సర్కార్ గుడ్‌న్యూస్
# 'రాజీవ్ యువ వికాసం' నవంబర్‌లో ప్రారంభం

**బీసీ ఓవర్సీస్ పథకానికి రూ. 18.40 కోట్లు మంజూరు**

**తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్ :**నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే రాజీవ్? యువ వికాస్? పథకాన్ని నవంబర్?లో ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన దరఖాస్తుదారులను ఎంపిక చేయాలని జిల్లాలోని కలెక్టర్ల కమిటీలను ఆదేశించారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'రాజీవ్ యువ వికాస్' పథకాన్ని నవంబర్‌లో ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ పథకం కోసం ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి, అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీలను ఆయన ఆదేశించారు. సోమవారం ప్రజాభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బీసీ సంక్షేమ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు చెందిన 1.3 లక్షల మంది విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌ల కింద రూ. 450 కోట్లను నేరుగా జమ చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. "బీసీ సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. 'కాటమయ్య రక్షణ కవచాల పథకం కింద 50,000 మందికి కిట్‌లను మంజూరు చేశాం. వీరిలో 40,000 మందికి ఇప్పటికే కిట్‌లు పంపిణీ చేయగా, మిగిలిన 10,000 మందికి త్వరలోనే **మిగతా2లో**

# పేదలకు కోటి రూపాయల విలువైన ఇందిరమ్మ ఇళ్లు

**గృహ నిర్మాణాల్లో సరికొత్త విప్లవానికి శ్రీకారం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటన**

రాష్ట్రంలో పేద ప్రజల సొంతింటి కలను అత్యంత అభివృద్ధితో, నాణ్యమైన ప్రమాణాలతో నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. **వివరాలు2లో**



# నిరుద్యోగులకు అలర్ట్?
## ఆ ఉద్యోగాల రాత పరీక్షల షెడ్యూల్ వచ్చేసింది

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :**తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పలు రాత పరీక్షల తేదీలను ప్రకటించింది. నాలుగు నోటిఫికేషన్?లకు సంబంధించి కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షల(సీబీఆర్టీ) షెడ్యూల్‌ను వెల్లడించింది. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. తెలంగాణలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాత పరీక్షల తేదీలను ప్రకటించింది. ఈ ఏడాదిలో ఇప్పటికే 10 ఉద్యోగ నోటిఫికేషన్‌లు జారీ చేయగా, ఇందులో దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిన 4 ప్రకటనలకు **మిగతా2లో**

# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

**దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం**

**ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య**

**ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ**





2

# బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

- ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ
- చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారని ఆరోపణ
- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం
- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న

# కేటీఆర్‌కు సిరిసిల్లలో సినిమా చూపిస్తాం



**రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ భూ బాగోతాలు బయటపెడతారన్న చామల**

**సీఎంను సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని చామల విమర్శ**

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేపు సిరిసిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా చూపిస్తామని, ఆ రోజును ఆయన జీవితంలో మర్చిపోలేరని హెచ్చరించారు. గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రాకముందే తనపై ఉన్న ఆరోపణలను బయటపెట్టాలని కేటీఆర్ 2లో

# నేడే సిరిసిల్లకు సీఎం రేవంత్ రెడ్డి రాక మహా బహిరంగ సభకు సర్వం సిద్ధం

రాష్ట్రం మొత్తం క్షణక్షణం, అనుక్షణం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అత్యంత కీలకమైన పర్యటన ఇది. రిసిరిసిల్లకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉంది. గతంలో అసెంబ్లీ వేదికగా సిరిసిల్ల ప్రాంతంలో జరిగిన సుమారు ఎనిమిది వేల ఎకరాల భూముల కబ్జాలు, అక్రమాలను బట్టబయలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గర్జించిన విషయం తెలిసిందే. ఇదే అంశాన్ని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కూడా బలంగా ప్రస్తావిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో నేడు సీఎం చేయబోయే సంచలన ప్రసంగంపై అటు అధికార పార్టీలోనూ, ఇటు ప్రతిపక్ష వర్గాల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కేటీఆర్ సొంతగడ్డపై ఏఏ సంచలన విషయాలు



వెలుగులోకి రాబోతున్నాయనేది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మరోవైపు కేవలం సిరిసిల్ల నియోజకవర్గమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ఉన్న లక్షలాది మంది పద్మశాలీలు ప్రస్తుతం రేవంత్ రెడ్డి పర్యటన వైపు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దశాబ్దాలుగా వలసలతో అల్లాడి, అనేక సమస్యలతో సతమతమవుతున్న నేతన్నలకు ఈ సభ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి భారీ వరాల జల్లు కురిపించబోతున్నారు అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పవర్లూమ్ రంగానికి రికార్డు స్థాయి సబ్సిడీలు, పద్మశాలీల సంక్షేమం కోసం శాశ్వత పథకాలు, కార్మికుల అభ్యున్నతికి సంబంధించిన కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది. ఎమ్మెల్యే లేని లోటును పూర్తిగా పూడ్చి, నేరుగా ప్రభుత్వ పెద్దలే స్వయంగా పర్యవేక్షిస్తూ ఈ సభను నిర్వహిస్తుండటంతో సిరిసిల్ల రాజకీయ చిత్రపటం పూర్తిగా మారబోతోందనే చర్చ జరుగుతోంది. నేడు జరగనున్న ఈ మహా బహిరంగ సభ ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు సృష్టించనుందనేది వేచి చూడాలి..

## నిరుద్యోగులకు సర్కార్ గుడ్‌న్యూస్ 'రాజీ యువ వికాసం' నవంబర్‌లో ప్రారంభం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు చెందిన 1.3 లక్షల మంది విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌ల కింద రూ. 450 కోట్లను నేరుగా జమ చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. "బీసీ సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. 'కాటమయ్య రక్షణ కవచాల పథకం కింద 50,000 మందికి కిట్‌లను మంజూరు చేశాం. వీరిలో 40,000 మందికి ఇప్పటికే కిట్‌లు పంపిణీ చేయగా, మిగిలిన 10,000 మందికి త్వరలోనే అందిస్తాం. ఈ రక్షణ కిట్‌ల కోసం ప్రభుత్వం రూ.60 కోట్లు ఖర్చు చేస్తోంది. హాస్టళ్లలోని విద్యార్థులకు సంబంధించిన ఆహార, సౌందర్య సాధనాల ఖర్చులను వారి ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ చేయాలి - భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి

**బీసీ ఓవర్సీస్ పథకానికి రూ. 18.40 కోట్లు మంజూరు**

బీసీ గురుకుల సొసైటీకి సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి అన్నారు. బీసీ గురుకుల విద్యా సంస్థల కోసం శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాదికి గాను బీసీ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ పథకం కింద 180 మంది లబ్ధిదారులకు రూ. 18.40 కోట్లను విడుదల చేశామని ఆయన చెప్పారు. అర్హులైన విద్యార్థులందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించేందుకు, విదేశీ విద్య కోసం దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నామన్నారు. ఆత్మ గౌరవ భవనాల కోసం నిధులను కూడా త్వరలో విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాఖకు చెందిన సీనియర్ అధికారులు సైదులు, బాలమాయాదేవి, మల్లయ్యభట్టు, పద్మ, ఇందిర, శ్రీనివాస్ రెడ్డి, అలోక్ కుమార్ పాల్గొన్నారు. రాజీవ్ యువ వికాసం ఈ ఏడాదిలోనే అమలు చేస్తాం: భట్టి విక్రమార్క బీసీ గురుకుల సొసైటీకి సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేస్తామని ఉప


ముఖ్యమంత్రి అన్నారు. బీసీ గురుకుల విద్యా సంస్థల కోసం శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాదికి గాను బీసీ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ పథకం కింద 180 మంది లబ్ధిదారులకు రూ. 18.40 కోట్లను విడుదల చేశామని ఆయన చెప్పారు. అర్హులైన విద్యార్థులందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించేందుకు, విదేశీ విద్య కోసం దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నామన్నారు. ఆత్మ గౌరవ భవనాల కోసం నిధులను కూడా త్వరలో విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాఖకు చెందిన సీనియర్ అధికారులు సైదులు, బాలమాయాదేవి, మల్లయ్యభట్టు, పద్మ, ఇందిర, శ్రీనివాస్ రెడ్డి, అలోక్ కుమార్ పాల్గొన్నారు.
రాజీవ్ యువ వికాసం ఈ ఏడాదిలోనే అమలు చేస్తాం: భట్టి విక్రమార్క


# ఒప్పించండి ఇప్పించండి

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ०152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు.

## చమురు ధర 100 డాలర్లు దాటింది ఇక పరుగులు పెట్టనున్న ద్రవ్యోల్బణం

7 నెలలగా పశ్చిమాసియా యుద్ధం కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో క్లిష్ట పరిస్థితులతో చమురు ధరలు వంద డాలర్లకు పైగా నమోదవుతున్నాయి. భారత్‌పై ప్రభావం పడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

7 నెలలగా కొనసాగుతున్న పశ్చిమాసియా యుద్ధంతో హర్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న క్లిష్ట పరిస్థితులు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, విధిస్తున్న సుంకాలతో వెరసి ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పూర్తి అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నాయి. వీటికి తోడు నిత్యం ప్రస్తావనకు వస్తున్న అంశమే అయినా ముడిచమురు ధరలు క్రమంగా పెరుగుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లకు పైనే తప్ప కిందికి దిగిరావడం లేదు. మళ్లీ 2% ధరలు పెరగడం సమస్యను తీవ్రతరం చేస్తోంది. ఫలితంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో మదుపర్లు తమ సంపదపై తీవ్ర అందోళన చెందుతున్నారు.

**ధర పెరిగితే ప్రపంచ దేశాలపై ప్రభావం**

ముడిచమురు ప్రపంచానికి కావాల్సిన ముఖ్య వనరుల్లో ఇదొకటి. వాస్తవంగా చెప్పాలంటే అన్నిరంగాలను ప్రభావితం చేసే ప్రధానమైన వనరు ఇది. అలాంటి ముడిచమురు ధరలు ఎంతమేర పెరిగితే ప్రపంచ దేశాలపై ఆ స్థాయిలో ప్రభావం ఉండడం కళ్ల ముందు కనిపించే వాస్తవమే. ప్రస్తుతం పరిస్థితులు అందుకు తగ్గట్టుగానే ఉన్నాయి. కొన్ని నెలలుగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లకు పైగా నమోదు అవుతుండటం సమస్య తీవ్రకు అద్దం పడుతోంది. రోజురోజుకు పెరగడమే తప్ప తగ్గే అవకాశాలు ఎక్కడా కనిపించకపోవడం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ధరలు మరింత పెరిగి ఆ ప్రభావం ప్రపంచ ఎకానమీపై ఉంటుందనే వాదనలు లేకపోలేవు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రపంచ దేశాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు డొనాల్డ్ ట్రంప్. పెరుగుతున్న ముడిచమురు ధరలే నిదర్శనం. ఆయన రెండో సారి అధికారం చేపట్టినప్పుడు ముడిచమురు బ్యారెల్ ధర సగటున 70 నుంచి 80 వరకు డాలర్లుగా ఉండేది. వాస్తవంగా చెప్పాలంటే అప్పటి వరకు ధరలు ఓ మోతాదులో పెరుగుతూ వచ్చాయి. కానీ, ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, విధిస్తున్న సుంకాలతో తెలియకుండానే ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. వీటన్నింటికీ తోడు 2026 ఫిబ్రవరి 28న జరిగిన ఓ పరిణామం చమురు ధరలకు రెక్కలు వచ్చేలా చేసింది. అదే ఇరాన్‌పై అమెరికా దాడులు జరపడం. ఆ పరిణామం తర్వాత చమురు ధరలు 100 డాలర్లను దాటేశాయి.

**126 డాలర్లకు చేరిన బ్యారెల్ ధర**

యుద్ధం మొదలైన రోజుల వ్యవధిలోనే అంటే మార్చిలోనే బ్యారెల్ ధర 100 డాలర్ల మార్క్‌ను అందుకుంది. పశ్చిమాసియాలో పరిస్థితులు రోజురోజుకు తీవ్రతరం అవుతున్నకొద్ది మరింతగా పెరిగాయి ధరలు. ఒకానొక స్థాయిలో బ్యారెల్ ధర 120 నుంచి 126 డాలర్లకు చేరుకుంది. ఆ తర్వాత తగ్గుతూ వచ్చినప్పటికీ చాలాసార్లు వంద డాలర్లగా పైనే చమురు ధరలు కదలాడుతున్న పరిస్థితి నెలకొంది. సెప్టెంబర్ 28 నాటికి బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర సుమారు రెండు శాతం వరకు పెరిగి 106 డాలర్లకు చేరుకుంది. అందులోనూ ఘోర ఓటమిని చవిచూస్తున్న ఇరాన్ ఒక ఒప్పందం కోసం ఎదురు చూస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. హర్మూజ్‌లో తాము చేపట్టిన నౌకా దిగ్బంధనం ఆ దేశంపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతోందని తెలిపారు. దీంతో ధరలు మరోసారి పెరిగాయి. "ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్? ఆయిల్ ధర? బ్యారల్? 100 డాలర్లకు పైగా నమోదవుతోంది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో పాటు భారత్? ఆర్థిక వ్యవస్థకూ ఇబ్బందిగా మారుతోంది. దీనికి ప్రధాన కారణం హర్మూజ్? జలసంధిలో యుద్ధం. ఇది మొదలైనప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా రావాల్సిన 20 శాతం ఆయిల్? తగ్గిపోయింది. దీంతో ఇంధన ధర 107 డాలర్లకు ఎగబాకుతోంది. శాంతి చర్చలు విఫలం కావడం, సౌదీ ఆయిల్ ప్రొడ్యూసర్?లపైన హౌతీల దాడులు, డ్రోన్స్ దాడులు దీనికి కారణంగా చెప్పవచ్చు" - డా.బచ్చు అనిల్? కుమార్, ప్రముఖ ఫైనాన్షియల్? ప్లానర్?

**రిఫైనరీలు తీవ్రస్థాయిలో ధ్వంసం**

చమురు ధరలు పెరగడానికి గల ప్రధాన కారణాల్లో అందులో ముఖ్యమైంది పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులే మొదటి వరుసలో నిలుస్తాయి. ఎందుకంటే, 6 నెలలకు పైగా కొనసాగుతున్న యుద్ధంతో గల్ఫ్ దేశాల్లో ముడిచమురు ఉత్పత్తి తగ్గిందని నివేదికలు చెబుతున్నాయి. ఉదాహరణకు సౌదీ అరేబియాను తీసుకుంటే ప్రపంచంలోనే అత్యధికంగా ముడిచమురు ఎగుమతి చేస్తున్న దేశం ఇది.

# కేటీఆర్‌కు సిరిసిల్లలో సినిమా చూపిస్తాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేపు సిరిసిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా చూపిస్తామని, ఆ రోజును ఆయన జీవితంలో మర్చిపోలేరని హెచ్చరించారు. గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రాకముందే తనపై ఉన్న ఆరోపణలను బయటపెట్టాలని కేటీఆర్ సవాల్ చేయడంపై చామల తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని అన్నారు. సిరిసిల్ల ప్రజల ముందే కేటీఆర్ భూ బాగోతాలను రేవంత్ బయటపెడతారని, ఆయన అసలు స్వరూపం దేశమంతటికీ తెలుస్తుందని అన్నారు. గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లలో నిజమైన అభివృద్ధి జరగలేదని, కేవలం శంకుస్థాపన లకే పరిమితమయ్యారని ఆరోపించారు. చిన్న వర్షానికే కలెక్టరేట్ భవనంలోకి వెళ్లలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లలో రూ.175 కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిందని, సీఎం పర్యటనలో రూ.345.75 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, నేతన్నల కోసం ప్రత్యేక బజార్ వంటి పనులను వివరించారు. మెట్రో, మూసీ ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

## పేదలకు కోటి రూపాయల విలువైన ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్ మహానగర పరిధిలో అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న ఈ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం సామాన్యుల ఊహకు అందని రీతిలో సాగుతోందని మంత్రి తెలిపారు. బహిరంగ విపణిలో మార్కెట్ విలువ ప్రకారం ఒక్కో ఇల్లు సుమారు ఎనభై లక్షల రూపాయల నుండి కోటి రూపాయల వరకు విలువ కలిగి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పేద కుటుంబాలకు కూడా విలాసవంతమైన నివాస వసతులు కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది.

సామాజిక భద్రతతో పాటు ఆత్మగౌరవ జీవితాన్ని అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. అన్ని రకాల మౌలిక వసతులు, విశాలమైన ఆవరణం మరియు నాణ్యమైన నిర్మాణ ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ టవర్స్ త్వరలోనే అర్హులైన పేదలకు అందుబాటులోకి రానున్నాయని ఆయన వివరించారు.

## బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన

తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు.

చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు.

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## నిరుద్యోగులకు అలర్ట్ - ఆ ఉద్యోగాల రాత పరీక్షల షెడ్యూల్ వచ్చేసింది.

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పలు రాత పరీక్షల తేదీలను ప్రకటించింది. నాలుగు నోటిఫికేషన్‌లకు సంబంధించి కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షల(సీబీఆర్‌టీ) షెడ్యూల్‌ను వెల్లడించింది. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

తెలంగాణలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాత పరీక్షల తేదీలను ప్రకటించింది. ఈ ఏడాదిలో ఇప్పటికే 10 ఉద్యోగ నోటిఫికేషన్?లు జారీ చేయగా, ఇందులో దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిన 4 ప్రకటనలకు సంబంధించి కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షల (సీబీఆర్‌టీ) పూర్తి షెడ్యూల్‌ను వెల్లడించింది.

**4 నోటిఫికేషన్ల ఉద్యోగాల భర్తీ**

అక్టోబర్, నవంబర్ నెలల్లో ఈ సీబీఆర్?టీ నిర్వహించనున్నట్లు తెలిపింది. టీజీపీఎస్సీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)లో అసిస్టెంట్ సైంటిస్ట్ (ఎనలిస్ట్ గ్రేడ్-2) 20 పోస్టులకు ఏప్రిల్‌లో, రోడ్లు, భవనాల శాఖలో సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు 222, సహాయ పర్యావరణ ఇంజినీర్ 19, పాఠశాల విద్యాశాఖలో డిప్యూటీ విద్యాధికారి 24 పోస్టుల భర్తీకి జూన్‌లో ప్రకటనలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దరఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రిపేర్? అయ్యేందుకు 3 నెలల గడువు ఇస్తూ రాత పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది.

**వీలైనంత త్వరగా ఫలితాలు**

నియామకాలకు సంబంధించి 90 శాతం నోటిఫికేషన్లకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించాలని టీజీపీఎస్సీ ఇప్పటికే నిర్ణయించింది.సీబీఆర్‌టీ పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థికి అప్పటికే సిద్ధమైన ప్రాథమిక కీ ప్రకారం ఆ పరీక్షలో సాధించిన మార్కులు అభ్యర్థి స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యేలా సంస్కరణలు చేస్తోంది. అప్లికేషన్లు ఎక్కువగా వచ్చిన పరీక్షలకు బహుళ సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు కమిషన్ తెలిపింది.

**3 నుంచి 6 నెలల్లో పూర్తి చేస్తాం**

సీబీఆర్‌టీ విధానం నేపథ్యంలో మార్కుల వెల్లడి, ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను పరిగణనలోకి తీసుకుంటే ఒక అంచెలో నిర్వహించే పోటీ పరీక్షల నియామకాలను 3 నుంచి 6 నెలల్లో పూర్తి చేస్తామని టీజీపీఎస్సీ ఇప్పటికే ప్రకటించింది. రెండు లేదా అంతకుమించిన అంచెల్లో పరీక్ష నిర్వహిస్తే ఆయా ఉద్యోగాలను 6 నుంచి 9 నెలల్లో భర్తీ చేస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో పరీక్షల ఫలితాలు వేగంగా వచ్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సిలబస్ మార్పు ప్రచారంతో ఆందోళన చెందుతున్న అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులు, సందేహాలపై స్పందించిన టీజీపీఎస్సీ పోటీ పరీక్షల సిలబస్‌లో పెద్దగా ఏవైనా మార్పులు ప్రతిపాదిస్తే ఒక సంవత్సరం ముందే తెలియజేస్తామని పేర్కొంది. ఒకవేళ సిలబస్‌లో స్వల్ప మార్పులు ఉన్నా గానీ ఆ వివరాలను సంబంధిత నియామక నోటిఫికేషన్‌తో పాటే జారీ చేస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు. అభ్యర్థులు సిలబస్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని కమిషన్ పేర్కొంది. పోటీ పరీక్షల్లో సిలబస్ మార్పు - ప్రకటన విడుదల చేసిన టీజీపీఎస్సీ

# శంషాబాద్ లో లిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఘనంగా 3కే రన్

రాజేంద్రనగర్ ప్రతినిధి సెప్టెంబర్ 29 తెలంగాణ పత్రిక

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శంషాబాద్ లోని లిమ్స్ న్యూరో ఓ కార్డియో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన 3కే రన్ ను ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తా నుండి ప్రారంభమైన ఈ రన్ రాళ్లగూడ సర్వీస్ రోడ్డు మీదుగా తొండుపల్లిలోని లిమ్స్ హాస్పిటల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో శంషాబాద్ పట్టణ,మండల ప్రజలే కాకుండా వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువకులు,డాక్టర్లు,నర్సులు, వాకర్స్ పెద్ద ఎత్తున పాల్గొని గుండె ఆరోగ్యంపై అవగాహన నినాదాలు చేశారు.అనంతరం 3కె రన్ లో పాల్గొన్న




వారందరికీ హాస్పిటల్ యాజమాన్యం సర్టిఫికెట్లు అందజేసింది.

**లిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ రాజ్ మాట్లాడుతూ....**

"ప్రస్తుత రోజుల్లో వయస్సుతో సంబంధం లేకుండా చిన్న వయసు వారికి కూడా గుండెపోటు రావడం సాధారణమైపోయింది. దీనికి ప్రధాన కారణాలు సరైన ఆహారం లేకపోవడం,వ్యాయామం చేయకపోవడం, రోజూ నడవకపోవడం,విపరీతమైన పని ఒత్తిడి వంటివి. ప్రజల్లో గుండెపోటు రాకుండా ముందు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి, ఆరోగ్యకరమైన జీవనశైలి ఎలా పాటించాలి అనే అంశంపై అవగాహన కల్పించేందుకే ఈ 3కే రన్ నిర్వహించాం" అని తెలిపారు.రోజూ కనీసం 30 నిమిషాలు నడవడం, జంక్ ఫుడ్ కు దూరంగా ఉండటం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని వైద్యులు ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

# తలకొండపల్లిలో ఘనంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2026





కల్వకుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 29 తెలంగాణ పత్రిక

ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కా సి రెడ్డి నారాయణరెడ్డి తలకొండపల్లి మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు మండల కేంద్రంలోని దేవకి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి పురస్కారాలు అందజేశారు వేదికపై భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ను చిత్రపటానికి సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి చాంప్లా నాయక్ అదేవిధంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగారావు పల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అధికారులు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు హాజరయ్యారు ఉపాధ్యాయ వృత్తి గొప్పతనాన్ని సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను వక్తలు కొనియాడారు మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు ప్ర సాం స పత్రాలు ఎమ్మెల్యే కా సి రెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా అందజేశారు ఉపాధ్యాయులను సత్కరించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వివిధ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# గంభీరావుపేటలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పర్యటన

**-ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 29

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజఠాకూర్ పర్యటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లా ప్రజలు గత పాలనతో విసిగిపోయారు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తోంది రైతులు, నేత కార్మికులు, యువత, మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది ఈ నెల 30న సిరిసిల్లలో జరిగే సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక సందేశం ఇవ్వనున్నారు సిరిసిల్ల జిల్లా అభివృద్ధి, రైతుల సమస్యలు, నేత కార్మికుల సంక్షేమంపై సీఎం



మాట్లాడనున్నారు పద్మశాలి నేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై సభలో స్పష్టత ఇవ్వనున్నారు గత పదేళ్ల పాలనలో సిరిసిల్ల ప్రాంతానికి జరిగిన నష్టాన్ని ప్రజలకు వివరిస్తామని తెలిపారు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నేత కార్మికులు, ఇతర వర్గాలకు అందించిన ప్రోత్సాహాన్ని ప్రజలకు గుర్తు చేయనున్నారు గ్రామాల వారీగా సభకు వచ్చే ప్రజల వివరాలతో జాబితాలు సిద్ధం చేయాలని నాయకులకు సూచించారు అంచనాలకు మించి భారీ సంఖ్యలో యువత, రైతులు, మహిళలు, ఇతర వర్గాల ప్రజలు సభకు హాజరయ్యేలా చూడాలని కోరారు సీఎం ఇచ్చే సందేశాన్ని నాయకులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు సంక్షేమ పథకాలకు అర్హులై ఇంకా ప్రయోజనం పొందని వారికి పథకాలు అందేలా నాయకులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు మండలంలోని నాయకులు ప్రజాప్రతినిధులు కలసి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్ తో పాటు వివిధ కమిటీల అధ్యక్షులు కార్యవర్గం యువ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# యువ క్రికెటర్ అక్షర కు కేటీఆర్ అభినందనలు

**-మంచి కోచ్‌తో పాటు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 29

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన యువ మహిళా క్రికెటర్ అక్షరను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు హైదరాబాద్ లో కేటీఆర్ ని సోమవారం రోజున అక్షర మర్యాదపూర్వకంగా కలిశారు అక్షరతో మాట్లాడిన కేటీఆర్ ఆమె క్రికెట్ ప్రస్థానం, సాధించిన విజయాలు, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు.ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్న అక్షర ఆరో తరగతి నుంచే క్రికెట్ ఆడటం ప్రారంభించానని, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో అండర్-19తో పాటు రాష్ట్ర స్థాయిలో పలుమార్లు ప్రాతినిధ్యం వహించినట్లు కేటీఆర్‌కు వివరించింది.



అక్షర ప్రతిభను అభినందించిన కేటీఆర్ ఆమెను శాలువాతో సత్కరించారు మంచి కోచ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు క్రికెట్‌లో ఎదిగేందుకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేటీఆర్ అందించిన ప్రోత్సాహంపై అక్షర సంతోషం వ్యక్తం చేసింది. భవిష్యత్‌లో భారత క్రికెట్ జట్టుకు ఎంపికై తెలంగాణకు మన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని పేర్కొంది



# దమ్మన్నపేట లో పోషణమాసం టెన్ మినిట్స్ ప్రోగ్రాం

**-సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 29

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో మంగళవారం రోజున పోషణ మాసం టెన్ మినిట్స్ ప్రోగ్రామ్స్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ హనుమంత్ నాయక్ హాజరయ్యారు ఎంపీడీవో రాజేందర్ ఎంపీఓ శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఐసిడిఎస్ సూపర్వైజర్ జి కళావతి పిల్లల యొక్క పెరుగుదల పర్యవేక్షణ గురించి తల్లులకు తెలియజేశారు గర్భిణీలు బాలింతల గుర్తింపు వారికి శిశు పోషణ తల్లిపాల ప్రాముఖ్యత పిల్లలు ఎదుగుదలకు ఇమ్యూనైజేషన్ అవసరమని తెలియజేశారు అంగన్వాడి సెంటర్ కి వచ్చిన పిల్లలకు ప్రతినెల పిల్లల యొక్క బరువు ఎత్తు తప్పకుండా తీయించుకొని అంగన్ వాడి సెంటర్ లో నిర్వహించే ఈసిసిఈ లో పాల్గొనాలని ఆరోగ్యం పరిశుభ్రత అంగన్వాడి సెంటర్ పరిసరాల యొక్క పరిశుభ్రత గురించి అంగన్వాడి యొక్క అవసరాలను గురించి అందించే సేవలను గురించి



తెలియజేశారు ఈకార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్ స్పెషల్ ఆఫీసర్ హనుమంతు నాయక్ తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లో లభించే అన్ని రకాల పోషకాల ఆహారం తీసుకుంటే పిల్లలకు లబ్ధి చేకూరుతుందని అలాగే మీకు ఎలాంటి అవసరాలు ఉన్న మాకు తెలియజేయాలని తెలుపుతూ ఇద్దరు తల్లులకు శ్రీమంతాలు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్ చంద్రకళ అంగన్వాడి టీచర్ మమత రేణుక ఆశ కార్యకర్త విజయ వివో అధ్యక్షురాలు జ్యోతి తోపాటు అధిక సంఖ్యలో తల్లి పిల్లలు పాల్గొన్నారు

# జాతీయ మానవహక్కుల కమిషన్ ప్రత్యేక ప్రతినిధికి కామారెడ్డిలోఘన స్వాగతం



కామారెడ్డి ,సెప్టెంబర్ 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక ప్రతినిధికి ఘన స్వాగతం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), న్యూఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి దేవేంద్ర కుమార్ నిమ్ కామారెడ్డి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలుసుకుని పూల మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ దేవేంద్ర కుమార్ నిమ్ ఎల్లారెడ్డి ఆర్డీఓ ప్రభాకర్‌తో కలిసి తదుపరి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గాంధారి మండలానికి బయలుదేరారు.

# ఐఎంఏ ఆధ్వర్యంలో 25 వ రక్తదాన శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్




జగిత్యాల, సెప్టెంబర్ 29 (తెలంగాణ పత్రిక):

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో జగిత్యాల (ఐఎంఏ) భవన్ లో "డొనేట్ బ్లడ్ -- సేవ్ లైవ్స్" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 25 వ రక్తదాన శిబిరాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం రక్త దాతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం ద్వారా రోడ్డు ప్రమాదాలు ప్రసూతి రక్తానికి సంబంధించిన వ్యాధులు ఇతర సమయాల్లో ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నిరంతరం శిబిరాలు నిర్వహిస్తున్న ఐఎంఏ ప్రతినిధులను అభినందించారు. మానవసేవే మాధవసేవ గా అందరూ భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యాధికారి శ్రీనివాస్ ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ అకుతోట శ్రీనివాస్ రెడ్డి కోశాధికారి డాక్టర్ సుధీర్ కౌన్సిలర్ ప్రశాంత్ రావు డాక్టర్ నాగరాజు డా: శంకర్ డా: కృష్ణమూర్తి ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ వైద్యులు ఐఎంఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బిబిపేటలో యోగా గురు బండి రాములు కి సన్మానం




కామారెడ్డి ,సెప్టెంబర్ 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాబీబీపేట మండల కేంద్రంలోని తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి బాలుర పాఠశాలలో మంగళవారం ఢిల్లీలో భారతీయ పద్మభూషణ్ అవార్డు అందుకున్న యోగా గురూజీ శ్రీ బండి రాములు ని పతంజలి యోగ సమితి బిబిపేట సభ్యులు శాలువా పూలదండలతో ఘనంగా సత్కరించారు ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీహరి, అనంత కుమార్, ప్రేమ్ కుమార్, గాడి లింగం, సుతారి రమేష్, బాసెట్టి నాగేశ్వర్, భూమా గౌడ్, వడ్ల భూమయ్య, యెంబరీ స్వామి, నందకుమార్, వడ్నాల రాజు, దోమల సిద్ధరాములు, ఆంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమయ పాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు

-ఇష్ట రాజ్యాంగ పంచాయతీ కార్యదర్శుల విధులు

-ప్రజలకు తప్పని ఇబ్బందులు

**ముధోల్:)29సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)**



మండల కేంద్రంతోపాటు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించకుండా ఇష్ట రాజ్యాంగ విధులకు హాజరు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముధోల్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయా లకు సమయానికి హాజరు కాకపోవడంతో వివిధ పనుల కోసం వచ్చే గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థాని కులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే కొందరు పంచాయతీ కార్యదర్శులు సమయానికి కార్యాలయాలకు రాకపో వడంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పంచా యతీ సంబంధిత దరఖాస్తులు, పారిశుద్ధ్యం, వీ ధిలైట్లు, తాగునీరు తదితర సమస్యలపై ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆరోపణలు ఉన్నాయి.గ్రామస్థుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, పంచాయతీ కార్యాలయాల్లో సమ యపాలన అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కార్యా లయాల హాజరు నమోదును పరిశీలించి, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బం దిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞ ప్తి చేస్తున్నారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్లాబ్ నిర్మాణానికి స్టీల్ సిమెంట్ అందజేత

**కల్వకుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 29 తెలంగాణ పత్రిక**



తలకొండపల్లి మండలంలోని లింగరావుపల్లి గ్రామపంచాయతీ కి చెందిన టేకూర్ భగవంతుకు రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ స్లాబ్ నిర్మాణం కొరకు స్టీలు సిమెంటు అందజేశారు ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఓరుగంటి వెంకటరెడ్డి మండల మాజీ కోఆప్షన్ నెంబర్ ఇమాన్ ఉప సర్పంచ్ బూత్కూర్ వెంకట్ రెడ్డి వార్డు నెంబర్ ప్రమోద్ కుమార్ సుమన్ గ్రామ అధ్యక్షుడు బొందల యాదయ్య మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ వడ్డేమోని యాదయ్య ప్రదీప్ రెడ్డి డీలర్ జంగయ్య వాలింపుల యాదయ్య జంగయ్య రాజీవ్ గాంధీ కుమార్ కిష్టయ్య మల్లయ్య రమేష్ కోటయ్య సాయిలు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

-తిరుమల కుటుంబానికి దశదిన కర్మల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం



**మంగపేట, సెప్టెంబర్ 22 (తెలంగాణ పత్రిక):**

కార్యకర్తలను, వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు మంగపేట మండలంలోని బోర్ నర్సాపురం గ్రామానికి చెందిన కర్రీ రామకృష్ణ భార్య తిరుమల కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుమల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఆమె స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.రేపు నిర్వహించనున్న దశదిన కర్మల ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందించి, కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు నూతనకంటి రాజు, సీనియర్ నాయకులు కబ్బాక లక్ష్మణ్, కొబ్బక శేషు, జోగా రామచంద్రయ్య, నారా సంబయ్య, ఇర్సవడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా

-పడకల్ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి..



**తెలంగాణ పత్రిక (కల్వకుర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 29) తలకొండపల్లి మండలం.**

తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన భయ్యా నరసింహ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, తనవంతు సహాయంగా రూ.4,000 నగదు ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా నరసింహ మృతి పట్ల సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కష్టకాలంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు గ్రామ ప్రజలు పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్‌ను స్థానికులు అభినందించారు. గ్రామంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు తనవంతు సహకారం అందిస్తూ మానవతా దృక్పథంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వాజిత్, జె. నరసింహ, రమేష్, తిరుపతి గౌడ్, రామస్వామి, బత్తుల లక్ష్మీనారాయణ, అంజయ్య, బషీర్, ఎం.డి. గౌస్, సత్తయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో'స్వచ్ఛ జలధార'

-అజిలాపూర్ లో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత..



**తెలంగాణ పత్రిక (కల్వకుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 29) వెల్దండ మండలం.**

ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ చేపట్టిన 'స్వచ్ఛ జలధార' కార్యక్రమం రెండో విడతలో భాగంగా మంగళవారం వెల్దండ మండలం అజిలాపూర్‌లో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఐదు తాగునీటి నిల్వ ట్యాంకులను ప్రత్యేక యంత్రాల సహాయంతో శుభ్రం చేశారు. ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించారు.కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి నిల్వ ట్యాంకులను దశలవారీగా శుభ్రం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు నాణ్యమైన తాగునీరు అందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు కార్యక్రమాన్ని అభినందిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరచడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, ఉప సర్పంచ్ గణేష్, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు, వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి భవనాలతో విద్యార్థినులకు ఇబ్బందులు

-నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ఎదురుచూపులు

**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) సెప్టెంబర్ 29**



వివేకానంద మినీ స్టేడియం ముందు గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండ టంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినుల కు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో భవనాలు వినియోగంలోకి రాకపోగా,పాఠశాల ప్రాంగణంలో నిర్మాణ సామగ్రి, ఇతర వస్తువులు పేరుకుపోతున్నాయని, పనులు కొనసాగుతున్న ప్రాంతంలో దుమ్ము, ధూళి సమస్యతో పాటు విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలుస్తోంది. అసంపూర్తిగా ఉన్న భవనాలు వర్షాకాలంలో మరింత సమస్యగా మారే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ ప్రాంతాన్ని పూర్తిగా రక్షితంగా ఉంచాలని వారు కోరుతున్నారు.పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు అవసరమైన తరగతి గదులు, ఇతర మౌలిక వసతులు అందుబాటులోకి రావాలంటే పనులను త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. సంబంధిత అధికారులు పాఠశాలను పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

-కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి



**తెలంగాణ పత్రిక (కల్వకుర్తి ప్రతినిధి)తలకొండపల్లి, సెప్టెంబర్ 29:**

విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో దేవకి గార్డెన్‌లో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, వారి సేవలను అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు.ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తును నిర్మించే శిల్పులని, వారి అంకితభావం, నిరంతర కృషి వల్లే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేసి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చంపేట ఎస్సీ సెల్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

-అధ్యక్షుడిగా కాటూరి రాజు ఎన్నిక



**మంగపేట, సెప్టెంబర్ 29 (తెలంగాణ పత్రిక):**

మంగపేట మండలం బుచ్చంపేట గ్రామంలో నూతన ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు సూచనలతో ఈ ఎన్నిక నిర్వహించారు.మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బసారీకారి హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యెంపెల్లి వీరస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు మైప లాలయ్య హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారం, సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం పనిచేయాలని సూచించారు.అధ్యక్షుడిగా కాటూరి రాజు, ఉపాధ్యక్షుడిగా దైద నరేష్, ప్రధాన కార్యదర్శిగా పగిడిపల్లి రవి, కార్యదర్శులుగా కాటూరి నవీన్, ఎలిశాల సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా బూర్గుల శివాజీ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా దైద ఉప్పాలయ్య, అక్కిపెల్లి మధు, గిద్దె యాకయ్య, బొడ్డు వెంకటయ్య ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో బుచ్చంపేట మాజీ సర్పంచ్, మాజీ ఆత్మ చైర్మన్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గడ్డం శ్రీహరి, గడ్డం పరమేష్, యెంపెల్లి సమ్మయ్య, పన్నాల కొండల్ రెడ్డి, పల్లె శోభన్, ధర్మారపు యాకయ్య, జంగం భానుచందర్, రాచకొండ సోములు, ధర్మారపు సాయిలు, పల్లె రాములు, బంటు రాములు, దైద ఉప్పలయ్య, ఎడ్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

-ముధోల్ ఎంపీవో శివకుమార్



**ముధోల్: 29సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)**

పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ముధోల్ ఎంపీవో శివకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ముద్గల్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు కాలనీలో చేస్తున్నపూడిక తీత పనులను పరిశీలించారు. పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో దోమల బెడద ఉన్నట్లయితే ఫాగింగ్ స్ప్రేను చేయాలన్నారు.ఏంపీవో వెంట సర్పంచ్ మేకల అనురాధ గణపతి ఉన్నారు.

# మాటలు కాదు.. ములుగు ప్రజలకు అభివృద్ధి కావాలి: బడే నాగజ్యోతి

**-ఇసుక లారీలతో రహదారులు ధ్వంసమవుతున్నా పట్టించుకోరా?**

**-ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై కార్యకర్తలు దృష్టి సారించాలి**

**మంగపేట, ఆగస్టు 29 (తెలంగాణ పత్రిక):**
ములుగు జిల్లా ప్రజలకు మాటలు కాదు.. అభివృద్ధి కావాలని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. మంగపేట మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలే పార్టీకి బలమని, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ములుగు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ములుగు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ మంత్రి సీతక్కపై విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగపేట నుంచి ఏటూరునాగారం వరకు రహదారులు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండలంలో అధిక సంఖ్యలో తిరుగుతున్న ఇసుక లారీల కారణంగా రహదారులు మరింత ధ్వంసమవుతున్నాయని, భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం రైతులకు ఆరు గంటల మూడు ఫేజ్‌ల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని విమర్శించారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల వసతి గృహాలు, విద్య, రహదారులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. కేవలం మాటలు, హామీలతో ప్రజా సమస్యలు పరిష్కారం కావని, క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, కార్యకర్తలు గ్రామగ్రామాన ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో మండల మాజీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, మాజీ



ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, మల్లూరు దేవస్థానం మాజీ చైర్మన్ నూతులకంటి ముకుందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, చిలకమర్రి రాజేందర్, కర్రీ శ్యాంబాబు, గుమ్మల వీరస్వామి, గుండారపు రమేష్, అచ్చ సత్యనారాయణ, కాటూరి సుగుణ, గుడివాడ శ్రీహరి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్లమెంటు విధానాలపై విద్యార్థులకు అవగాహన







**-విద్యార్థులతో మాక్ పార్లమెంటరీ ప్రదర్శన**

**వెంకటాపురం. (నూగురు) సెప్టెంబర్ 29.: తెలంగాణ** జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా పిల్లల పార్లమెంట్ ప్రదర్శన పార్లమెంటరీ విధానాలపై విద్యార్థులకు అవగాహన -- నాయకత్వ లక్షణాల పెంపునకు కార్యక్రమం ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాక్ పిల్లల పార్లమెంట్ ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో పాఠశాల విద్యార్థులు మాక్ పార్లమెంటు సమావేశాల నిర్వహణ, సభా విధానాలు, మంత్రుల బాధ్యతలు, ప్రశ్నోత్తరాల సమయం తదితర అంశాల ను పాత్రధారణ ద్వారా చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం జి వి సత్యనారాయణ నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాక్ పిల్లలు పార్లమెంట్ కార్యక్రమాన్ని ఎంతో చక్కగా ప్రదర్శించారని, వారి ప్రతిభ అభినందనీయమని అన్నారు. చిన్న వయస్సులోనే విద్యార్థులకు ప్రజాస్వా మ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలు, నాయకత్వ బాధ్యతలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

**విద్యార్థుల ప్రతిభకు అభినందనలు**

పిల్లల మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, వివిధ శాఖల మంత్రులు, ప్రతిపక్ష సభ్యులు తదితర పాత్రలను పోషించారు. సభ ప్రారంభం నుంచి ప్రశ్నోత్తరాల సమయం, ప్రజా సమస్యల ప్రస్తావన, మంత్రుల సమాధానాలు, ప్రతిపక్ష సభ్యుల సూచనలు వంటి అంశాలను విద్యార్థులు తమదైన శైలిలో ప్రదర్శించారు. పార్లమెం టులో సభ్యులు ప్రజా సమస్యలను ఎలా ప్రస్తావిస్తారు, ప్రభుత్వం తరఫున మంత్రులు ఎలా సమాధానం ఇస్తారు, స్పీకర్ సభను ఎలా నిర్వహిస్తారు వంటి విషయాలను విద్యార్థులు ప్రదర్శన ద్వారా వివరిం చారు. విద్యార్థుల ప్రసంగం, ప్రశ్నించే విధానం, సభా నియమాలను పాటించిన తీరు కార్యక్రమానికి హాజరైన వారిని ఆకట్టుకుంది. హెచ్‌ఎం నారాయణ విద్యార్థుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, మాట్లాడే నైపుణ్యం, సమస్య లను అర్థం చేసుకునే సామర్థ్యం పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు.

**కాఫేడ్ సంస్థ కార్యక్రమాలకు అభినందనలు**

ఈ సందర్భంగా కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పిల్లల అభివృద్ధి కార్యక్రమాలను హెచ్‌ఎం నారాయణ అభినందించారు. విద్యార్థుల్లో చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించేందుకు సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలకు ఇటువంటి అవకాశాలు కల్పించడం వల్ల వారి ప్రతిభను వెలికితీసేందుకు మంచి వేదిక లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో సమాజ సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేలా ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

**నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యం**

కాఫేడ్ సంస్థ డైరెక్టర్ లూర్థురాజు మాట్లాడుతూ పిల్లల పార్లమెంట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, సభలో మాట్లాడే ధైర్యాన్ని పెంచడం అని తెలిపారు. దేశ పార్లమెంటులో జరుగుతున్న సభా విధానాలు, ప్రశ్నోత్తరాల సమయం, ప్రజా సమస్యలపై చర్చ, మంత్రుల సమాధానాలు, ప్రతిపక్ష సభ్యుల పాత్ర వంటి అంశాలను విద్యార్థులు తెలుసుకునేలా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పిల్లలు కేవలం పుస్తకాల్లో విషయాలను చదవడం మాత్రమే కాకుండా, వాటిని ప్రాక్టికల్‌గా తెలుసుకోవడం ద్వారా మరింత సులభంగా అర్థం చేసుకోగలరని తెలిపారు. మాక్ పిల్లల పార్లమెంట్ ద్వారా భవిష్యత్‌లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించవచ్చని అన్నారు.

**విద్యార్థుల ప్రదర్శనకు డైరెక్టర్ లూర్థురాజు అభినందనలు**

కార్యక్రమంలో పాల్గొన్న కాఫేడ్ సంస్థ డైరెక్టర్ లూర్థురాజు రాజు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహం తో పార్లమెంట్ పాత్రలను పోషించడం, సభా విధానాలను అర్థం చేసుకుని ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. పిల్లలు ప్రశ్నించడం, సమాధానం చెప్పడం, ఇతరుల అభిప్రాయాలను వినడం, సభా నియమాలను పాటించడం వంటి అంశాలను ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలకు సంస్థ తరఫున సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

**పిల్లలలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి వేదిక**

మాక్ పిల్లల పార్లమెంట్ కార్యక్రమం విద్యార్థులకు వినూత్నమైన అనుభవాన్ని అందించింది. సాధారణంగా పుస్తకాలలో చదివే పార్లమెంటరీ విధానాలను విద్యార్థులు ప్రత్యక్షంగా పాత్రధారణ ద్వారా ప్రదర్శించడం ద్వారా వాటిపై స్పష్టమైన అవగాహన పొందారు. విద్యార్థులు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం, వాటిపై చర్చించడం, సంబంధిత మంత్రులు సమాధానం ఇవ్వడం వంటి అంశాలను ప్రదర్శించారు. దీంతో విద్యార్థుల్లో సమస్యలపై ఆలోచించే శక్తి, మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, సమన్వయంతో పనిచేసే సామర్థ్యం పెంపొందే అవకాశం ఏర్పడింది.

**ఉపాధ్యాయులు, విద్యార్థుల హర్షం**

కార్యక్రమం అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రదర్శనను అభినందించారు. పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించడం వల్ల వారి ప్రతిభతో పాటు సామాజిక అవగాహన కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. పిల్లల పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తమ అనుభవాలను పంచుకున్నారు. పార్లమెంటు ఎలా పనిచేస్తుంది, స్పీకర్ బాధ్యతలు ఏమిటి, మంత్రులు మరియు ప్రతిపక్ష సభ్యుల పాత్ర ఏమిటి వంటి విషయాలను ప్రాక్టికల్‌గా తెలుసుకోవడం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. మొత్తంగా జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సభ మాక్ పిల్లల పార్లమెంట్ కార్యక్రమం విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, మాట్లాడే నైపుణ్యం మరియు సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమంగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లోని మరిన్ని పాఠశాలల్లో నిర్వహించాల్సిన అవసరం ఉందని కార్యక్రమ ంలో వెంకటాపురం మండల సర్పంచ్ తాటి సరస్వతి కోఆర్డినేటర్స్ గొంది హనుమంత్ కామేష్. ప్రశాంత్ . నరేష్. బాస్కార్ ఉషా ఇందిరా పద్మ రమాదేవి సుజాల దీపరాణీ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు. వంశి. జయరాం శేషు నరసింహారావు ఉపాధ్యాయుల బృందం విద్యార్థులుపాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

## ఫారంఫండ్ (నీటికుంట) అభివృద్ధి పనులు ప్రారంభం



**సారంగాపూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ పత్రిక):**
జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని మండలంలో మొట్ట మొదటిగా పారంపండ్ ఉపాధి హామీ పథకం నిధులతో నీటికుంట అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ మేకల శేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ మెంబర్ మహిపాల్ రెడ్డి వార్డ్ మెంబర్లు ఫీల్డ్ అసిస్టెంట్ రవి సెక్రెటరీ సర్వ శ్రేష్ట ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి,ప్రతినిధి సెప్టెంబర్-29 ( తెలంగాణ పత్రిక )**





ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరంగా, సమర్థవంతంగా అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యాలయాల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఫైళ్లు, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, కార్యాలయాలు, పరిసరా లను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం, సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, ప్రజల సమస్యలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లు అప్పగించిన పోలీసులు

**-హర్షం వ్యక్తం చేసిన బాధితులు**

**పాపన్నపేట, సెప్టెంబర్ 29:(తెలంగాణ పత్రిక)**



పోగొట్టుకున్న ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో పాపన్నపేట పోలీసులు జిల్లాలోని ప్రథమ స్థానం నిలిచారు. వివరాల్లోకి వెళ్తే గత కొంతకాలంగా వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న ఫోన్ల బాధితులు మీసేవ ద్వారా కంప్లైంట్ చేశారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 601 ఫోన్లను పోలీసులు గుర్తించగా అందులో 589 సెల్ ఫోన్లు ( 98 శాతం) రికవరీ చేసి బాధితులకు అందజేశారు. మంగళవారం సైతం మరో 12 ఫోన్లు రికవరీ చేసి పోగొట్టుకున్న బాధితులకు ఫోన్లను అప్పగించారు. ఈ 12 ఫోన్ల విలువ 2 లక్షల 4500 విలువ ఉంటుంది. పోగొట్టుకున్న ఫోన్లను అతి త్వరలోనే గుర్తించి రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో పాపన్నపేట పోలీసులు జిల్లాలోని ప్రథమ స్థానంలో నిలిచారు. గతంలో సైతం పెద్ద ఎత్తున ఫోన్లు రికవరీ చేసి డిఎస్పి చేతుల మీదుగా అందజేశారు. పోయిన ఫోన్లను రికవరీ చేసి అందజేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా 9వ జాతీయ పోషణ మహోత్సవ కార్యక్రమం



**భీమారం, సెప్టెంబర్ 29, తెలంగాణ పత్రిక :**
భీమారం మండలం ఖాజీపల్లి గ్రామం లో ని అంగన్వాడి కేంద్రం లో జాతీయ పోషణ మహోత్సవ కార్యక్రమం గ్రామ సర్పంచ్ కొండూ శ్యామల ఆధ్వర్యంలో లో ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం పోషక విలువ ల తో కూడిన వంటల పోటీలు నిర్వహించి బాహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి , అంగన్వాడి సూపర్వై జర్, అంగన్వాడీ టీచర్స్ ,ఆశ వర్కర్స్ మరియు గర్భిణీలు, కిషోర్ బాలికలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మానవ సేవా యే మాధవ సేవా

**-సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**

**-నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి అండగా సిమెంట్ సహాయం చేసిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**



కల్వకుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 29,తెలంగాణ పత్రిక.....

తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామపంచాయతీకి చెందిన మల్లె మొగ్గల శ్రీను నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణము అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణం కొరకు సిమెంట్ ఇప్పించడం జరిగింది . ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మానవ సేవా యే మాధవ సేవా అని పేదలకు సహాయం చేయడం దేవుడు కల్పించిన వరం అని నిరుపేద కుటుంబానికి తనవంతు సహాయం చేయడం తృప్తి ఇచ్చిందని తెలిపారు. ఎవరికీ ఏ సహాయం కావాల్సిన తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా సహాయం పొందిన కుటుంబ సభ్యులు లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ మరియు తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపడం జరిగింది.

## జుట్టు తిరుపతి ముదిరాజ్ భార్య ను పరామర్శించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**-ఆయనతో పాటు పాల్గొన్న తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, లింగరావు పల్లి సర్పంచ్, శాతబ్ది టౌన్ షిప్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి**



కల్వకుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 29,తెలంగాణ పత్రిక...



తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో జుట్టు తిరుపతి ముదిరాజ్ గారి నివాసానికి కల్వకుర్తి శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి విచ్చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు జుట్టు తిరుపతి ముదిరాజ్ గారి కుటుంబ సభ్యులను, ముఖ్యంగా వారి భార్య పద్మమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై గుండె కు స్టంట్ వేసుకున్న సందర్భంగా వారిని ఆప్యాయంగా పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.కుటుంబ సమస్యలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.. అనంతరం స్థానిక సమస్యలు, మండలంలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# యశోద ఆసుపత్రిలో రోబోటిక్ మోకాలి మార్పిడి చికిత్స లు

కామారెడ్డి ,సెప్టెంబర్ 29,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




యశోద ఆసుపత్రిలో రోబోటిక్ టెక్నాలజీతో మోకాలి చిప్ప మార్పిడి చికిత్స లు ప్రారంభించామని డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం కామారెడ్డి లోఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. గత 35 సంవత్సరాలుగా ఆధునిక సేవలు అందిస్తున్న ఆసుపత్రిలో రోబోటిక్ మోకాలి మార్పిడి చికిత్సలు ప్రారంభించామని ఆయన వివరించారు. రోబోటిక్ చికెన్ చాలా ధర రోగులు మెరుగైన ఆరోగ్యాన్ని పొందుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# రాజుపేటలో రూ.3.27 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

**-నిధుల మంజూరుపై సీతక్కకు రామచంద్రునిపేట గ్రామస్తుల కృతజ్ఞతలు**

మంగపేట, సెప్టెంబర్ 29 (తెలంగాణ పత్రిక):



మంగపేట మండలం రాజుపేట కేంద్రంగా రామచంద్రునిపేట గ్రామంలో నూతన విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు రూ. 3.27 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మంగపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా సబ్‌స్టేషన్ ఏర్పాటు కీలకమన్నారు. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడం సంతోషకరమని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే రాజుపేట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడి, రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ సందర్భంగా నిధుల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చింతా పున్నారావు, అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా సీనియర్ నాయకులు వెంగల బుచ్చిరెడ్డి, మాసిరెడ్డి వెంకటరెడ్డి, పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, తుడి భగవాన్ రెడ్డి, చౌలం వెంకటేశ్వర్లు, పెద్ది నరసింహారావు, యర్రంగారి సురేష్, ఎడ్ల నరేష్, చాదా మల్లయ్య, శానం సత్యనారాయణ, బాడిషా ఆదినారాయణ, గూడూరు రంజిత్, యెంపెల్లి వీరస్వామి, జంగం భానుచందర్, బిలుపాటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**-అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి**

**-ఉచిత విద్య కుటుంబ వైద్య ఖర్చులకు పరిమితి లేకుండా వైద్య సౌకర్యం కల్పించాలి**

**-దళిత జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి**

**-అభయ హస్తం కింద 12 లక్షలు అందించాలి**

**-దళిత జర్నలిస్టులు అకాల మరణం చెందితే 50 లక్షల రూపాయలు ఎక్స్రేషియా ఇవ్వాలి**

టేక్మాల్ తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 29



సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అక్టోబర్ 7న నిర్వహించనున్న దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను మంగళవారం టేక్మాల్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని దళిత జర్నలిస్టులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని జర్నలిస్ట్ నాయకులు పిలుపునిచ్చారు. దళిత జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రతి దళిత జర్నలిస్టుకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించాలని, కుటుంబ వైద్య ఖర్చులకు పరిమితి లేకుండా వైద్య సౌకర్యం కల్పించాలని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఉచిత బస్, రైలు పాస్‌లు అందించాలని, దళిత జర్నలిస్టులకు అభయహస్తం పథకం కింద రూ.12 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. పత్రికలు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వాలని, సీనియర్ దళిత జర్నలిస్టులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. దళిత జర్నలిస్టులు అకాల మరణం చెందితే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, నిరుద్యోగ దళిత జర్నలిస్టులకు నెలకు రూ.15 వేల నిరుద్యోగ భృతి అందించాలని, ప్రెస్ అకాడమీ చైర్మన్, సభ్యులుగా దళిత జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టులు రాజు, బుచ్చయ్య, బాగయ్య, నరేందర్, ప్రేమ్‌కుమార్, కుమార్, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రక్షణ సేన టేక్మాల్ మండల ఇన్‌చార్జి బొబ్బిలి సుధాకర్ కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

## మాదకద్రవ్యాల వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి







**-యువత డ్రగ్స్, గంజాయి బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి**

**-రామగుండంలోని డీ-అడిక్షన్ సెంటర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ శ్రీ రాములు**

పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 29 ( తెలంగాణ పత్రిక )

?యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీరాములు అన్నారు.?మంగళవారం అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు రామగుండంలోని డీ-అడిక్షన్ సెంటర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీ రాములు మాట్లాడుతూడీ-అడిక్షన్ సెంటర్‌లో అందుతున్న వైద్య సేవలు, చికిత్సా విధానం, కౌన్సెలింగ్, రోగులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాదకద్రవ్యాల బారిన పడిన వారికి మెరుగైన వైద్యం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఆరోగ్య, సామాజిక , ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.?జిల్లాలోని అన్ని గ్రామాల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామ స్థాయిలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు, తల్లిదండ్రులు, యువత సమన్వయంతో పనిచేయాలని, బాధితులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి తగిన వైద్య చికిత్స అందేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అనంతరం రామగుండంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, పారిశుధ్యం, మందుల లభ్యత తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.?ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ రవీందర్ రావు, ఆర్ఐ రాజేందర్ సీడీపీఓ అలేఖ్య, సీ-సెక్షన్ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, సంబంధిత అధికారులు తదితరులు, పాల్గొన్నారు.

# వరి నుంచి ఆయిల్‌పామ్ వైపు

**-ప్రతి రెండు నెలలకు ఆదాయం పొందుతున్న రైతు**

**-జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్**

పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 29 ( తెలంగాణ పత్రిక )



సంప్రదాయ వరి సాగు నుంచి ఆయిల్‌పామ్ సాగుకు మారిన శ్రీ వావిలాల రాజేశ్వరి రావు, లోకపేట గ్రామం, ఎలిగేడు మండలం, ప్రస్తుతం ప్రతి రెండు నెలలకు ఒకసారి దిగుబడి ద్వారా ఆదాయం పొందుతూ విజయవంతమైన ఆయిల్‌పామ్ రైతుగా నిలుస్తున్నారు. గతంలో వరి సాగు చేసిన శ్రీ వావిలాల రాజేశ్వరి రావు, నీటి వినియోగం, సాగు ఖర్చులు మరియు దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని ఆయిల్‌పామ్ సాగును చేపట్టారు. ప్రస్తుతం ఆయన తోట దిగుబడికి రావడంతో ప్రతి సుమారు రెండు నెలలకు ఒకసారి ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ విక్రయించి ఆదాయం పొందుతున్నారు.ఆయిల్‌పామ్ తోట స్థిరపడిన తరువాత క్రమం తప్పకుండా దిగుబడి పొందే అవకాశం ఉండటం తనకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని ఆయన తెలిపారు. తోట పూర్తిస్థాయి దిగుబడికి వచ్చే వరకు అంతర పంటల ద్వారా కూడా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.ప్రస్తుతం ఆయిల్‌పామ్ ధర రూ.24,025 మెట్రిక్ టన్నుకు చేరడం రైతులకు మరింత ప్రోత్సాహకరంగా ఉందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అనుకూలమైన భూములు, నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.శ్రీ వావిలాల రాజేశ్వరి రావు విజయగాథ వరి నుంచి ఆయిల్‌పామ్ వైపు మారుతున్న రైతులకు ఆదాయ అవకాశాలను తెలియజేసే మంచి ఉదాహరణగా నిలుస్తోందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి సిరిసిల్ల నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవాలి

**-తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ మజహార్**

**గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 29**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతరెడ్డి సిరిసిల్ల నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా టిజెయస్ అధ్యక్షులు అబ్దుల్ మజహార్ మంగళవారం రోజున పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నవంబర్ 26వ తేదీన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఆది శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నేను ఆసమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు కోసం మీ మద్దతు కోరడానికి వస్తే మీరు వెంటనే స్పందించి రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి రాజన్న సిరిసిల్ల జిల్లాకు రావడం జరిగింది, ప్రభుత్వం దిగివచ్చి వెంటనే రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రకటించింది. ఈ విషయాన్ని సభా వేదికపై మీ దృష్టికి తీసుకువస్తే, సిరిసిల్ల జిల్లాను కెసిఆర్ కేటీఆర్ మెడలు వంచి తీసుకొచ్చానని సభాముఖంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీరు ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే సిరిసిల్ల నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది సభ వేదికపై. మీరు స్పందించి ఆనాడు ఎన్నికల సభలో సిరిసిల్ల నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని ఇక్కడి ప్రజానీకానికి హామీ ఇవ్వడం జరిగింది. అన్న ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది, మీరు ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టారు, కావున దగాపడ్డ విధ్వంసానికి భూకబ్జాలకు గురైన సిరిసిల్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలంటే మీరు సిరిసిల్ల నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవాలి. సిరిసిల్ల నియోజకవర్గంలో మళ్లీ కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలంటే మీరు దత్తత తీసుకొని అభివృద్ధి పరిస్థితి సిరిసిల్ల గడ్డమీద కాంగ్రెస్ మువ్వన్నెల జెండా ఎగరేయవచ్చు. గత పది సంవత్సరాల భారత రాష్ట్ర సమితి పార్టీ అధికారంలో సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదు. కాలేశ్వరం 9వ ప్యాకేజీ పూర్తి కాలేదు, దీంతో ఇక్కడి రైతాంగం సాగునీటికి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. తెలంగాణ లోనే తొలి ప్రాజెక్ట్ అప్పర్ మానేరు డ్యాం పదేళ్ల పాలనలో అభివృద్ధి నోచుకోక విధ్వంసానికి గురైంది. ఒక్క పైసా కూడా ప్రాజెక్టు కోసం కేటాయించలేదు. జలయజ్ఞం పేరిట ధన యజ్ఞం జరిగింది. సంక్షేమ పథకాలు కేవలం గులాబీ చొక్కాలకే పరిమితమయ్యాయి. మీరు వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రతి పథకం పార్టీలకు రాజకీయాలకు ప్రాంతాలకతీతంగా ప్రతి ఒక్కరికి అందుతున్నాయి బిఆర్ఎస్ కార్యకర్తలు అన్ని



విషయాల్లో లాభపడ్డారు. ప్రశ్నిస్తే సిరిసిల్ల నియోజకవర్గం లో కేసులు అరెస్టులు పాలయ్యే వాళ్ళం. చినుకు పడితే చాలు సిరిసిల్ల జిల్లా కేంద్రం సముద్రాన్ని తలపిస్తుంది. ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారం కాలేదు. మీరు వెంటనే స్పందించి సిరిసిల్ల నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటే సిరిసిల్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. మీరు 50 కోట్ల రూపాయలతో పద్మశాలీల కోసం యారాం డిపో మంజూరు చేశారు. చేనేత కార్మికుల రుణమాఫీ చేశారు. ప్రజలు మిమ్మల్ని మీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు

# అక్టోబర్ 3న సూర్యాపేటలో 'జల్సా-ఎ-ఖాతీముల్ అంబియా' మహాసభ

**లితెలంగాణ పత్రిక ,సూర్యాపేట సెప్టెంబర్ 29లి**

మజ్లిస్-ఎ-తహఫ్ఫుజ్ ఖత్మె నబువ్వత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 3న సూర్యాపేటలో 'జల్సా-ఎ-ఖాతీముల్ అంబియా వ ఇస్లా-ఎ-ముఆషిరా' పేరిట భారీ ధార్మిక, సామాజిక సంస్కరణల మహాసభ నిర్వహించనున్నట్లు సభ కన్వీనర్ హాఫీజ్ ఖలీల్ అహ్మద్ తెలిపారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం రాత్రి 8:30 గంటలకు మస్జిద్-ఎ-అక్సా ప్రాంగణంలో జరిగే ఈ సభకు దేశంలోని ప్రముఖ ఇస్లామిక్ విద్వాంసులు, ఉలేమాలు, మతపెద్దలు హాజరై ధార్మిక, సామాజిక అంశాలపై ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గుజరాత్‌లోని బరోడాకు చెందిన ప్రముఖ ఇస్లామిక్ విద్వాంసులు హజ్రత్ మౌలానా ముఫ్తీ షఫీక్ అహ్మద్ సాహబ్ దామత్ బరకాతుహు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రసంగం చేయనున్నారని తెలిపారు. మౌలానా అత్హర్ మజాహిరీ సాహబ్ గౌరవ అధ్యక్షతన ఈ సభ కొనసాగుతుందని వివరించారు. సూర్యాపేట జిల్లాలోని ఉలేమాలు, హాఫీజ్‌లు, మస్జిద్ ఇమామ్‌ల ఆధ్వర్యంలో సభకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. అలాగే, సూర్యాపేట జిల్లా ఎస్పీ కె నర్సింహ గారు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు, కాబట్టి, మన, జిల్లాలోని ముస్లిం సోదరులంతా అధిక సంఖ్యలో హాజరై ఈ మహాసభను విజయవంతం చేయాలని కన్వీనర్ హాఫీజ్ ఖలీల్ అహ్మద్ కోరారు.



# ఉపాధ్యాయుడి కుటుంబానికి పీఆర్టీయూ అండ

**-లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేత**
**-సభ్యుల కుటుంబాలకు అండగా ఉంటాం**
**-వంగ మహేందర్ రెడ్డి, పీఆర్టీయూ టీ ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి**

**నంగునూరు, సెప్టెంబర్ 29(తెలంగాణ పత్రిక):**

పీఆర్టీయూ సభ్యుడిగా ఉన్న ఉపాధ్యాయుడు బి. రాజయ్య అకాల మరణం చెందడంతో, ఆయన కుటుంబానికి పీఆర్టీయూ రాష్ట్ర సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. పీఆర్టీయూ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి ఈ చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. సిద్ధిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ)గా విధులు నిర్వహిస్తున్న బి.రాజయ్య మృతి పట్ల



పీఆర్టీయూ నాయకులు విచారం వ్యక్తం చేశారు. సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్నందున రాష్ట్ర సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును అంద జేసి, కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, పీఆర్టీయూ సభ్యులకు, వారి కుటుంబాలకు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సభ్యులు అకాల మరణం చెందితే వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా సంక్షేమ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి కారుణ్య నియామకం విషయంలోనూ, ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందే విషయంలోనూ పీఆర్టీయూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధరశర్మ, సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్ రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆస దశరథం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె. వెంకటేశ్వర్లు, ఎం.డి. ఫసీయుద్దీన్, నిమ్మ శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి యు.రాజు, మండల శాఖ ఉపాధ్యక్షుడు ఎం.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం ఘనంగా



**తెలంగాణ పత్రిక వలిగొండ మండలం సెప్టెంబర్ 29.**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండల పరిధిలోని వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ సర్వసభ్య సమావేశం ఎస్వీఎస్ ఏసీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగయ్య సమక్షంలో ఈ సమావేశం జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ ఫకీరు కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డమీద వీరస్వామి , డైరెక్టర్లు గుండాల సత్యనారాయణ గౌడ్, నాగిరెడ్డిపల్లి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం 13 మంది డైరెక్టర్లు హాజరై వార్షిక నివేదిక, భవిష్యత్ ప్రణాళిక తదితర అంశాలపై చర్చించారు. మండల పరిధిలోని 25 గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నూతన చైర్మన్ ఫకీరు కొండల్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని సన్మానించి అభినందనలు ఎమ్మెల్యే తెలిపారు. పాలకవర్గ సభ్యులు తమ పదవులకు న్యాయం చేస్తూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. నూతన చైర్మన్ ఫకీరు కొండల్ రెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్లను సమన్వయం చేసుకుంటూ మండలంలోని 25 గ్రామాల రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం పాలకవర్గం సమష్టిగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు..

# మండల స్థాయిలో దివ్యాంగుల విద్యార్థులకు ఆటల పోటీలు

**తెలంగాణ పత్రిక ఓదెల 29 సెప్టెంబర్**




ఓదెల జిల్లా పరిషత్ పాఠశాలలో భవిత సెంటర్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి వై రమేష్ అధ్యక్షతన మండల స్థాయిలో సి డబ్ల్యూ ఎస్ ఎన్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓదెల గ్రామ సర్పంచి కనికి రెడ్డి సతీష్ . ఓదెల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి వి.పద్మ హాజరై, విద్యార్థులను ఉద్దేశించే మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులలో ఆటల వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం ఆనందం కలుగుతుందని తెలియజేశారు సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఆటలు దివ్యాంగ విద్యార్థుల మానసిక సామాజిక భాపద్వేగా వికాసానికి ఆత్మ న్యూనత తగ్గించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ ఈ ఆటలు ఇతరులతో కలిసి పనిచేయడం వల్ల సహకార భావన పెరుగుతుందని వారిలోని ప్రతిభ ప్రదర్శించే అవకాశం కలుగుతుందని తెలియజేశారు. వివిధ కేటగిరీలో గెలుపొందిన విద్యార్థులకు డిసెంబర్ మూడో తారీకు దివ్యాంగుల దినోత్సవం రోజు బహుమతులు ప్రధానం చేయబడుతుందని తెలియజేశారు. అదేవిధంగా ఈ మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే ఆటల పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థుల తల్లులు తల్లిదండ్రులు మరియు ఐ ఈ ఆర్ పి గాయత్రి ఎస్ ఎ పి డి లు, రాజేందర్ హరికృష్ణ మరియు సంజీవ్, యుపిఎస్ ఇందుర్తి హెచ్ఎం శ్రీనివాస్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి

**-జిల్లాలో 03 లక్షల 20వేల హెక్టార్లలో రైతులు వరి సాగు**
**-జిల్లాలో 518 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**
**-గ్రేడ్ ఏ ధాన్యానికి - 2461 కామన్ రకానికి- 2441**
**-07 రకాల సన్న వెరైటీ విత్తనాలకు 500 రూపాయల బోనస్**
**-మిల్లర్ల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సవ్యంగా నిర్వహణ**
**-కేంద్రాల్లో అన్ని సౌకర్యాల కల్పనకు చర్యలు**
**-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**

**మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) 29 సెప్టెంబర్**

ఖరీఫ్ (వానాకాలం) సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి కాన్ఫరెన్స్ హాల్లో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ, మార్కెటింగ్, డీఆర్‌డీఓ, రవాణా, పోలీస్ శాఖల అధికారులతో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలను సంసిద్ధంగా తయారు చేసినట్లు చెప్పారు. 2026-27 సంవత్సరానికి గాను జిల్లాలో 03 లక్షల 20వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేసినట్లు అంచనా వేసినట్లు వివరించారు. దొడ్డు రకం -413, సన్న రకం-105 కేంద్రాలు మొత్తం 518 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రేడ్ ఏ ధాన్యానికి-2461, సాధారణ రకం-




2441 ధర నిర్ణయించినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఐకేపీ (IKP),174, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం-300 , సహకార మార్కెటింగ్ సొసైటీ - 12 ,(FPO ) ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్- రైతు ఉత్పత్తిదారుల సంస్థ). ఆధ్వర్యంలో -32 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారురాష్ట్రంలో ప్రోత్సాహం కోసం ఏడు ప్రాధాన్య వరి రకాలను గుర్తించామన్నారు. BPT 5204, ఆర్ఎన్ఆర్ 15048,HMT సోనా,జై శ్రీరామ్ , కెఎన్ఎం 1638, WGL 44, కెఎన్ఎం 7715. వివిధ రకాల సన్న రకం వడ్ల బోనస్ లపొందుపరిచినట్లు తెలిపారు టార్పాలిన్లు-14353, ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్స్-06, తేమ కొలిచే యంత్రాలు-655, అందుబాటులో ఉంచామన్నారు, గన్ని బ్యాగ్స్ -51 లక్షల 75000 ఉన్నాయన్నారు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు ప్రభుత్వాదేశాల మేరకు తీసుకునే విధంగా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అదనంగా ఉన్న ప్యాడిని ఇంటర్మీడియట్ గోడౌన్లో స్టోరేజ్ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్నారు.ధాన్యం రవాణా చేసే లారీలకు నిబంధనల ప్రకారం ఖచ్చితంగా జీపీఎస్ (లేదా) వాహన స్థాన నిర్ధారణ వ్యవస్థను అమర్చాలని, తద్వారా ధాన్యం మళ్లింపును అరికట్టవచ్చని అన్నారు. అలాగే వరికోత మిషన్లను ముందస్తుగా పరిశీలించి, వాటి ఫిట్‌నెస్, భద్రతను సరిచూడాలని రవాణా శాఖ అధికారులకు స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎండ, వర్షాల నుంచి రక్షణ కల్పించేందుకు టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, తగినన్ని గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ట్రక్కుల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేయడంలో సరిపడా హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముందస్తుగా క్షేత్రస్థాయిలో గోదాములను పరిశీలించాలని, వాటి సామర్థ్యాన్ని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అలాగే మహిళా సంఘాల సభ్యులతో ముందస్తుగా సమావేశాలు నిర్వహించి, వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రాల నిర్వహణ సాఫీగా సాగేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను విజయవంతంగా చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, సహకార శాఖ అధికారి పద్మ, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్ రవాణా శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాస్గి--తుంకిమెట్ల--లోతుకుంట తండా మీదుగా పరిగికి బస్సు నడపాలి

**-విద్యార్థులు, ప్రయాణికులు, రైతుల ఇబ్బందులు పరిష్కరించాలని బీజేపీ మండల శాఖ విజ్ఞప్తి**



**బొంరాస్ పేట్ - తెలంగాణ పత్రిక:**
బొంరాస్‌పేట్ మండలంలోని కాస్గి, తుంకిమెట్ల, లోతుకుంట తండా మీదుగా గడిసింగపూర్ వరకు, అక్కడి నుంచి పరిగి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ బొంరాస్‌పేట్ మండల శాఖ కోరింది. ఈ మేరకు ఆర్టీసీ డీఎంను కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను వివరించి, వెంటనే బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం ఈ మార్గంలో సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండల శాఖ నాయకులు తెలిపారు. ముఖ్యంగా గిరిజన తండాలకు చెందిన విద్యార్థులు విద్య కోసం ప్రతిరోజూ కనీసం 5 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కాస్గి నుంచి తుంకిమెట్ల, లోతుకుంట తండా, గడిసింగపూర్ మీదుగా పరిగి వరకు బస్సు సర్వీసు అందుబాటులోకి వస్తే విద్యార్థులతో పాటు తండాల ప్రజలు, రైతులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీజేపీ మండల శాఖ నాయకులు పేర్కొన్నారు. వ్యవసాయ పనులు, విద్య, వైద్యం, మార్కెట్ అవసరాల కోసం పరిగి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కాస్గి--తుంకిమెట్ల--లోతుకుంట తండా--గడిసింగపూర్--పరిగి మార్గంలో బస్సు సర్వీసును ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని ఆర్టీసీ అధికారులను బీజేపీ బొంరాస్‌పేట్ మండల శాఖ కోరింది.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల సీనియర్ నాయకులు నాగురావు, జగదీష్ సాగర్, మాజీ మండల అధ్యక్షులు నర్సింహులు, ఎస్ సి మార్చ మండల అధ్యక్షులు జనార్ధన్, సతీష్, పుట్టి శ్రీనివాస్, శివానంద, వెంకటయ్య, అనిల్ నాయక్,బ్యాగరి చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ ఎంత? స్పష్టత ఇవ్వాలి

**-30 అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాలి.. తక్కువైతే బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలి**



**బొంరాస్ పేట్ - తెలంగాణ పత్రిక:**
బొంరాస్‌పేట్ మండల కేంద్రం మీదుగా వికారాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారి 163 విస్తరణలో భాగంగా రహదారి ఎంత మేర విస్తరణకు గురవుతుందో అధికారులు స్పష్టంగా తెలియజేయాలని బీజేపీ బొంరాస్‌పేట్ మండల శాఖ కోరింది. రోడ్డు విస్తరణలో భాగంగా రైతులు, చిన్న వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరారు. బొంరాస్‌పేట్‌లో అనేక మంది చిన్న వ్యాపారులు చిట్టీలు కట్టుకుంటూ, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారని బీజేపీ మండల శాఖ నాయకులు తెలిపారు. రోడ్డు విస్తరణ కారణంగా వ్యాపారాలు, జీవనోపాధిపై ప్రభావం పడకుండా అధికారులు ముందస్తుగా రహదారి విస్తరణ హద్దులను స్పష్టంగా ప్రకటించాలని కోరారు. వికారాబాద్--బొంరాస్‌పేట్ మార్గంలో రహదారి నిర్మాణం కనీసం 30 అడుగుల మేర ఉండేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల శాఖ డిమాండ్ చేసింది. రహదారి నిర్మాణ సమయంలో స్థల పరిమితుల కారణంగా 30 అడుగుల రోడ్డు నిర్మాణం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడితే, ప్రజలు, వ్యాపారులు, రైతులకు ఇబ్బందులు కలగకుండా బొంరాస్‌పేట్ పట్టణానికి పక్కగా బైపాస్ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. బైపాస్ రోడ్డు నిర్మాణం ద్వారా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గడంతో పాటు, ప్రధాన రహదారి విస్తరణ వల్ల చిన్న వ్యాపారులు, రైతులపై పడే ప్రభావాన్ని కూడా తగ్గించవచ్చని బీజేపీ మండల శాఖ తెలిపింది. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణపై అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాలని, భవిష్యత్‌లో రహదారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక రూపొందించాలని కోరింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రజలకు నష్టం కలగకుండా, వ్యాపారుల జీవనోపాధికి ఇబ్బందులు రాకుండా, అవసరమైన చోట బైపాస్ రహదారి నిర్మాణాన్ని కూడా పరిశీలించాలని బీజేపీ బొంరాస్‌పేట్ మండల శాఖ కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేపీ మండల సీనియర్ నాయకులు నాగురావు, జగదీష్ సాగర్, మాజీ మండల అధ్యక్షులు నర్సింహులు, ఎస్ సి మార్చ మండల అధ్యక్షులు జనార్ధన్, సతీష్, పుట్టి శ్రీనివాస్, శివానంద, వెంకటయ్య, అనిల్ నాయక్,బ్యాగరి చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యం

**-సిద్ధన్నపేటలో ఘనంగా పోషణ మాసోత్సవం**





**నంగునూరు, సెప్టెంబర్ 29(తెలంగాణ పత్రిక):**
పోషకాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని నంగునూరు తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డి అన్నారు. పోషణ అభియాన్‌లో భాగంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు కత్తుల గంగా భవాని, కాచగోని లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ఐ లింగం, ఏపీఎం శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి అనితా రెడ్డి, గ్రామ సర్పంచి సంగు పురేందర్, ఉప సర్పంచి చిలుకల తిరుపతి రెడ్డి, ఐసీడీఎస్ ఏసీడీపీఓ హరిత, పర్యవేక్షకురాలు రజిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, తల్లులకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ద్వారా శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది పడుతుందని తెలిపారు. ముర్రు పాల(తల్లి మొదటి పాలు) ప్రాముఖ్యతను వివరించారు. శిశువు జన్మించిన వెంటనే లభించే ముర్రుపాలు శిశువుకు అవసరమైన పోషకాలు, రోగ నిరోధక శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అన్న ప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో కార్యక్రమంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. పోషణ మాసోత్సవంలో భాగంగా తల్లులు, పిల్లలు, గ్రామస్తులకు ఆరోగ్యం, పోషణ, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు సరైన పోషకాహారం అందించడం, గర్భిణీలు వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవడం, పిల్లల ఎదుగుదలను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం వంటి అంశాలను వివరించారు. తల్లి ఆరోగ్యం -- శిశువు ఆరోగ్యం -- కుటుంబ ఆరోగ్యం -- సమాజ ఆరోగ్యం అనే లక్ష్యంతో పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ అధికారులు, వైద్యులు, ముంద్రాయి సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో తల్లులు, పిల్లలు, గ్రామస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చదువుకున్న యువతకు ఎంచుకున్న రంగంలో స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు

**-జిల్లా లో యువత కు ఉపాది కల్పించే విధంగా పటిష్ట ప్రణాళిక తో ముందుకుపోతున్నాం**
**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్ జిల్లాప్రతినిధి (తెలంగాణ పత్రిక) 29 సెప్టెంబర్**
జిల్లాలో చదువుకున్న యువతకు స్థానికంగా ఉన్న పరిశ్రమలలోనే ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఎం ఇ ఎస్ ఐ సి పోర్టల్ ద్వారా పటిష్ట ప్రణాళికలు రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం వీడియో సమావేశ హాలులో జిల్లా నైపుణ్య అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో చదువుకున్న యువతకు వారు ఎంచుకున్న రంగంలో స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నామన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు మరియు నైపుణ్యం గల యువత యొక్క సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలన్నారు.నిరుద్యోగ యువత వారు కోరుకుంటున్న రంగంలో దానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించి, వారికి ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మెదక్ ఎంప్లాయ్‌మెంట్, స్కిల్స్ అండ్ ఇండస్ట్రీ కనెక్ట్ పోర్టల్ అనేది విద్యార్థులు, పరిశ్రమలు మరియు యజమానుల మధ్య అంతరాన్ని తగ్గించడానికి రూపొందించిన ఒక డిజిటల్ వేదిక. అని తెలిపారు. ఈ పోర్టల్, మెదక్ జిల్లా యొక్క సమ్మిళిత మరియు సాంకేతికత ఆధారిత యువత ఉపాధి మార్గంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన అధికారి రామరాజు, పరిశ్రమల అధికారి యాదయ్య, ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీనివాస్ , సంబంధిత ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 30లోగా డిజిటల్ పంటల సర్వే పూర్తి చేయాలి





**-ప్రతి రైతు సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి**
**-డిజిటల్ పంటల సర్వే లేక ఏ ఒక్క రైతు కూడా సన్న రకం ధాన్యం బోనస్ కోల్పోకూడదూ**
**-రైతులతో సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వేను పూర్తి చేయాలి**
**-డిజిటల్ పంటల సర్వేపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 29 ( తెలంగాణ పత్రిక )**
ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో డిజిటల్ పంటల సర్వేను వేగవంతం చేసి, సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని మండలాల డిజిటల్ పంటల సర్వేపై సంబంధిత అధికారులతో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులతో సమీక్షా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న డిజిటల్ పంటల సర్వే పురోగతి, రైతుల సాగు వివరాల ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సెప్టెంబర్ 30లోగా పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ పొందేందుకు డిజిటల్ పంటల సర్వే వివరాలు కీలకమని తెలిపారు. డిజిటల్ పంటల సర్వే పూర్తికాకపోవడం వల్ల సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న ఏ ఒక్క రైతు కూడా బోనస్ కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైతుకు సంబంధించిన పంట వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ఏఈఓలు, వ్యవసాయ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుంటూ డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. రైతుల నుంచి అవసరమైన వివరాలను సేకరించి, సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
మండలాల వారీగా సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా జాప్యం ఉంటే వెంటనే గుర్తించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎంపిక చేయబడిన వాలంటీర్లను పర్యవేక్షిస్తూ,ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా డిజిటల్ పంటల సర్వేను పూర్తిచేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సోయా దళారుల దందా షురూ

**-ఇష్టారాజ్యంలో ధరలు**
**-అనుమతులు జాడ లేని వైనం**



**ముధోల్:29సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)**
నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లో సోయా దళారి వ్యవస్థకు ఏలాంటి అనుమతులు లేకుండా దళారి వ్యవస్థ ఇ ష్టరాజ్యంగా కొనసాగుతోంది.సోయా కోత ప్రారంభమైందో లేదో అరుగాలం కష్టపడి పండించిన పంటను రైతుల నుండి కొనుగోలు చేయడానికి దళారులు తమ దందాను షురూ చేశారు. చిన్న,సన్న కారు రైతులకు ఒక ధర పెద్ద పెద్ద భూస్వాములకు మరో ధర పెడుతూ వారికిష్ట మొచ్చిన ధరను నిర్ణయిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నా రు.రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు తేమ శాతాన్ని బట్టి ధరను నిర్ణయిస్తారు.ఎక్కువ తేమ శాతం తక్కువ ధర ,తక్కువ తేమ శాతం ఉంటే ఎక్కువ ధర నిర్ణయిస్తు న్నారు.అంతే కాకుండా ప్రతి క్వింటా లుకు 2కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నట్టేట ముంచు తున్నారు.తేమ శాతం రైతులకు మాత్రమే కానీ వీరు కొనుగోలు చేసిన పిదప తక్కువ తేమ శాతం ఉన్న ధాన్యం,ఎక్కువ తేమ శాతం ఉన్న ఒకే దగ్గర కలిపి దాన్ని సంచు ల్లో నింపి అమ్ముకోవడానికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.కష్టపడి పండించిన రైతుకోనిబంధనలు, ఎలాంటి కష్టం లేకుండా ఏ అనుమతులు లేకున్నా దళారులకు మాత్రం నిబంధనలు లేవు.ఇలా చిన్న ,సన్న కారు రైతులను లక్ష్యంగా చేసుకుని దళారులు తమ దందాను నడుపుతూ అడపాద డపా సంపాదిస్తున్నారు. ముధోల్ లో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు భైంసా మార్కెట్ కమిటీ తరపున ఏమైనా అనుమతులు ఇచ్చారా అని సంబంధిత సెక్రటరీని అడగ్గా సమాధానాన్ని దాటవేస్తున్నారు.మరి వీరి దళారి దందాను అడ్డుకుంటారా లేదా వీరిని అధికారులు ప్రోత్సహిస్తారా చూడాల్సిందే..

## ముస్లిం మైనార్టీల ఓర్సు దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల, సెప్టెంబర్ 29 (తెలంగాణ పత్రిక):**

జగిత్యాల పట్టణంలోని ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓర్సు దినోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని నిర్వాహకులైన ముస్లిం మైనార్టీ సోదరులకు ఓర్సు దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో ఐకమత్యంతో పండుగలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించు కోవడం ఆనందంగా ఉందన్నారు. టిఆర్ నగర్లో నిరుపేదలకు జీఓ 59 కింద 116 మందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని 200 మందికి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వమని నిరంతరం పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి






అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. శాంతి సౌభ్రాతృత్వం పరస్పర గౌరవంతో జగిత్యాల మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణిశ్రీనివాస్ మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ కౌన్సిలర్లు చాంద్ పాషా లావణ్య పద్మ రాజేందర్ స్వప్న పవిత్ర మమత రామకృష్ణ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జెల్ల రవీందర్ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సద్దాం హుస్సేన్ కోటగిరి మోహన్ మెన్నెనీ ప్రవీణ్ రావు ముస్లిం మైనార్టీ నాయకులు మత పెద్దలు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాడి పరిశ్రమతో ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు

**– ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆదాయం పెంచుకోవాలి**

**– ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన పాడి గేదెలను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**ఆత్మకూరు: సెప్టెంబర్ 29, (తెలంగాణ పత్రిక):**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి కుటుంబం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. పాడి గేదెల పెంపకం ద్వారా కుటుంబాలకు నిత్య ఆదాయం లభించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఆత్మకూరు మండలంలోని అక్కంపేట, కామారం, పెంచికలపేట, నీరుకుళ్ల గ్రామాల్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన పాడి గేదెలను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. పాడి గేదెల సంరక్షణ, వాటి ఆరోగ్యం, పాడి ఉత్పత్తి తదితర అంశాలను లబ్ధిదారులను



అడిగి తెలుసుకున్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా కుటుంబాలకు స్థిరమైన ఆదాయం సమకూర్చి, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. శ్వేత విప్లవంలో భాగంగా దామెరలో మహిళలతో పరకాల ఇందిరా మహిళా డైరీని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే



తెలిపారు. రాబోయే రెండేళ్లలో 40 వేల కుటుంబాలను డైరీలో భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. పాడి గేదెలను సక్రమంగా సంరక్షిస్తూ పాల ఉత్పత్తిని పెంచుకోవాలని, తద్వారా కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రాయికల్ మండలంలో రెసిడెన్షియల్ స్కూల్స్ ను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆకస్మిక తనిఖీ

**-విద్యార్థుల భద్రత మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత**

**జగిత్యాల, సెప్టెంబర్ 29 (తెలంగాణ పత్రిక):**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ రాయికల్ మండలంలోని జగన్నాథ్ పూర్ ఒడ్డె లింగాపూర్ గ్రామాల్లోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు పాఠశాలల నిర్వహణ ఆహారం పారిశుధ్యం ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత ఆరోగ్యం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆహారం తయారీ ఆహార పదార్థాల నిల్వ వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.



విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత వంటశాలల పరిశుభ్రత పారిశుధ్య నిర్వహణ ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల హాజరు తదితర అంశాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో వంటశాలల పరిస్థితులను పరిశీలించి అవసరమైన చోట ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుతున్నాయా



మౌలిక వసతుల్లో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పి. నరేష్ జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము తహసీల్దార్ నాగార్జున ఎంపిడివో చిరంజీవి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం పేరుతో అక్రమ వసూళ్లు

**-ప్రజలకు ఉత్తమ సేవలందించే అధికారులను డబ్బులు ఇవ్వాలని బ్లాక్ మెయిల్..**

**-డబ్బులు ఇవ్వని అధికారులను వేధింపులకు గురి చేస్తున్న చర్లపల్లి వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలి..**

**-కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్య దర్శి మంద సాంబయ్య..**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి:( తెలంగాణ పత్రిక) సెప్టెంబర్ 29**

సమాచార హక్కు చట్టం పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రజలకు సేవలందించే ఉత్తమ అధికారులను టార్గెట్ గా చేసుకుని, విచ్చలవిడిగా డబ్బులను ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేస్తూ..డబ్బులు ఇవ్వని అధికారులను వేధింపులకు గురిచేస్తున్న మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డి పల్లి గ్రామానికి చెందిన చర్లపల్లి వెంకటేశ్వర్లుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మంద సాంబయ్య జిల్లా కలెక్టర్ కు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సొమ్మును దుర్వినియోగం చేసే అవినీతి అధికారుల బాగోతంను బట్ట బయలు చేసేందుకు ఉపయోగపడే సమాచార హక్కు చట్టాన్ని చర్లపల్లి వెంకటేశ్వర్లు అనే బ్లాక్ మెయిలర్ దుర్వినియోగపరుస్తూ..సమాచార హక్కు చట్టాన్ని తన జేబు నింపే సంస్థగా మార్చుకున్నాడన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాతో పాటు మొగుళ్లపల్లి మండలంలో ఉన్నటువంటి నిస్వార్థ సేవకులైన అధికారులను టార్గెట్ చేయడం తనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకుల మనసును కలచివేసిందన్నారు. మొగుళ్లపల్లి మండలంలో రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ..నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమైనటువంటి అధికారులను ఉద్యోగం సరిగా చేసుకోనివ్వకుండా ఇబ్బందులకు గురి చేయడంతో.. మండలంలోని సంబంధిత రైతులు చర్లపల్లి వెంకటేశ్వర్లు తతంగాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. సోమవారం రోజున జరిగిన గ్రీవెన్స్ లో ఏలాంటి అవినీతి ఆరోపణలు లేకుండానే మహిళా తహసీల్దార్ జాలీ సునీతా రెడ్డిని బదిలీ చేయాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞాపన పత్రాన్ని అందజేసిన చర్లపల్లి



వెంకటేశ్వర్లు బాగోతాన్ని మంద సాంబ య్య విలేకరుల ముందు వెల్లడించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు నుండి మొదలుకొని కార్యదర్శి, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సర్పంచుల నుండి మొదలు మండలంలోని అధికారులను విచ్చలవిడిగా బ్లాక్మెయిల్ చేస్తూ. .ఒక్కొక్కరి వద్ద వేలాది రూపాయలను డిమాండ్ చేస్తున్నాడని, ఏ పాపం ఎరుగని కొందరు ఉద్యోగులు భయపడి తనకు డబ్బులను సమకూర్చుతుంటే..అదే అదునుగా భావించి ప్రతి ఒక్క అధికారిని బెదిరించడం తన నైజంగా మార్చుకున్నాడన్ని, ఇలాంటి వ్యక్తి సమాజంలో ఉండడం వలన..మంచి పేరు ప్రఖ్యాతులు కలిగిన అధికారులు భయభ్రాంతులకు గురికావాల్సి వస్తుందని బాధపడ్డారు. తహసిల్దార్ జాలీ సునీతా రెడ్డి ఏ ఒక్క సమస్యను పెండింగ్ లో పెట్టలేదని, ఆర్డీవో జిల్లా కలెక్టర్ దృష్టిలో ఉన్న పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్న తరుణంలో తనకు డబ్బులు ఇవ్వలేదు అనే నేపంతో..ఆమెను బదిలీ చేయాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించడం పట్ల మంద సాంబయ్య ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలే తప్ప..ఇలా దుర్వినియోగం చేస్తున్న చర్లపల్లి వెంకటేశ్వర్లు లాంటి వ్యక్తులను సమాజంలో తిరగనివ్వొద్దని, గతంలో విద్యుత్ శాఖ ఏఈని బెదిరించి కరెంట్ పోల్స్ తీసుకొని..బయట అమ్ముకున్న చర్లపల్లి వెంకటేశ్వర్లు బాగోతాన్ని ఆయన బట్ట బయలు చేశారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ప్రజా సంఘాలు మేల్కొని చర్లపల్లి వెంకటేశ్వర్లుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎక్కడ చర్లపల్లి వెంకటేశ్వర్లు సమాచార హక్కు చట్టం వేసిన..ఆ చట్టం ముసులో అతను చేస్తున్న మోసాన్ని గ్రహించి.. అతనికి తగిన గుణపాఠం నేర్పాలని సమాజానికి మంద సాంబయ్య పిలుపునిచ్చారు.

## ఆర్టీసీ బస్సులను అడ్డగించిన విద్యార్థులు

**కామారెడ్డి, సెప్టెంబర్ 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం, సమయపాలన పాటించకపోవడం పట్ల గ్రామస్తులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో బస్సు ఆపడం లేదని కామారెడ్డి మండలం రాఘవాపూర్ గ్రామస్తులు బస్సును అడ్డగించి ఆందోళన చేపట్టారు. కామారెడ్డి నుంచి రాఘవపూర్ మీదుగా ముత్యంపేట, దోమకొండ పెద్దమల్లారెడ్డికి వెళ్తున్న బస్సులను రాఘవాపూర్ గ్రామంలో ఎందుకు ఆపడం లేదని గ్రామస్తులు నిలదీశారు. ప్రతిరోజూ రాఘవపూర్ స్టేజీ వద్ద బస్సు నిలిపి విద్యార్థులను ఎక్కించుకోవాలని డిమాండ్ చేశారు. బస్సులు ఆపకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపట్టి ఆర్టీసీ బస్టాండ్‌ను ముట్టడిస్తామని విద్యార్థులు, గ్రామస్తులు హెచ్చరించారు. అలాగే పెద్దమల్లారెడ్డి గ్రామంలో సమయానికి బస్సులు రావడం లేదని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గతంలో సమయానికి బస్సులు వచ్చేవని తెలిపారు. బస్సులు ఆలస్యంగా రావడంతో సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నామని, క్లాసులు మిస్సవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సమయానుకూలంగా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు.

## హిందూ దేవుళ్ళపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

**-ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేసిన మండల బీజేపీ నాయకులు**



**గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 29**

హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో సీఎం తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బీజేపీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో కోడె రమేష్, జిల్లా ధార్మిక క్షేత్ర అధ్యక్షుడు సత్యనారాయణ, మల్లేష్ యాదవ్, బోయన్నగారి శీను, బండ దేవయ్య, ఎక్కాల దేవి చంద్రం, తిరుపతి, శ్రీను, దుర్గేష్, ఎలిందర్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సిరిసిల్లకు ఏం చేస్తారో సభలో స్పష్టం చేయాలి..బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



**గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 29**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాపగారి వెంకట స్వామి గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దమ్మన్నపేట సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, కొల్లమద్ది సర్పంచ్ దిలీప్ సెస్ డైరెక్టర్ నారాయణరావు, గంధ్యదపు రాజు ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆధారాలతో నిరూపించాలని, లేనిపక్షంలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిసిల్ల నియోజకవర్గానికి ఇప్పటివరకు ఏం చేసిందో ప్రజలకు వివరించాలని కోరారు. నేడు సిరిసిల్లలో జరగనున్న సీఎం సభలో నియోజకవర్గానికి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, నిధులపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రభుత్వం ఏం చేయబోతోందో ముందుగానే వెల్లడించాలని అన్నారు. తమ నాయకులపై సీఎం చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మల్లెశ్వరమ్మ చిత్రపటానికి నివాళులు.. మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు



మిర్యాలగూడ ప్రతినిధి//సెప్టెంబర్ 29:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ: పట్టణంలోని ఎంవిఆర్ ఫంక్షన్ హాల్ నందు తిరునగరు భార్గవ్ తల్లి తిరునగరు మల్లెశ్వరమ్మ ప్రధమ సంవత్సరికం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లెశ్వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, మల్లెశ్వరమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎండి.యూసుఫ్, దుర్గంపూడి నారాయణరెడ్డి, అన్న భీమోజు నాగార్జున చారి, ఎండి ఇలియాస్ ఖాన్, ఎండి మగ్దూం భాష, పెద్ది శ్రీనివాస్ గౌడ్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పాలుట్ల బాబయ్య, అంగోతు హాతిరాం నాయక్,కుందూరు వీరకోటి రెడ్డి, నంద్యాల శ్రీరామ్ రెడ్డి, బంటు శ్రీనివాస్,సోము సైది రెడ్డి, మగ్రి అంజిబాబు, చిర్ర మల్లయ్య యాదవ్, మాలావత్ రవీందర్ నాయక్,గంగుల బిక్షం యాదవ్, ఐల వెంకన్న గౌడ్,రఫీ భాయ్,రామావత్ వినోద్ నాయక్, సూరకారపు ఉదయభాస్కర్ గౌడ్, ధనావత్ వీరా నాయక్, ఎస్డి, కర్ణ గోవిందరెడ్డి, నకరికంటి రాబర్ట్, రాజబోయన గోపి యాదవ్, లావుడి సుధాకర్ నాయక్, నర్రా ముకేశ్ చౌదరి, సుధీర్ తదితరులున్నారు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన సరితకు గోలి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సాయం అందజేత



కల్వకుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 29 తెలంగాణ పత్రిక

వెల్దండ మండలం కేంద్రానికి చెందిన శేఖర్ అలివేల దంపతుల కుమార్తె సరిత ఎంబీబీఎస్ సీటు సాధించిన వైద్య విద్యలో ప్రవేశం పొందిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆమెను అభినందించారు ఈ సందర్భంగా సరితతో పాటు ఆమె తల్లిని శాలువాలతో సన్మానించి ఉన్నత విద్యను కొనసాగించేందుకు 10000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు ఈ సందర్భంగా గోలి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని ప్రతిభతో ఎంబిబిఎస్ సీటు సాధించడం అభినందనీయమని అన్నారు సరిత భవిష్యత్తులో ఉన్నత సాయికి ఎదిగి మంచి వైద్యురాలుగా సేవలందించాలని ఆకాక్షించారు విద్యార్థుల ఉన్నత చదువులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వెల్దండ మండల బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్ట రామ్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్ మాజీ అధ్యక్షులు జోగయ్య నాయకులు మాజీ ఎంపీటీసీ నాగులు నాయక్ మాజీ ఉప సర్పంచ్ నిరంజన్ మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్ మాజీ సర్పంచ్ అంజి నాయక్ వెల్దండ మండల బీసీ సెల్ అధ్యక్షులు మాజీ ఉపసర్పంచ్ నరసింహ ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగయ్య ఉపసర్పంచ్ రాజు సీనియర్ నాయకులు ప్రసాద్ వెంకటయ్య పోలే అశోక్ వార్డు సభ్యులు సునీత ఆనంద్ కుమార్ నరసింహ మహేష్ బర్క గణేష్ శీను తదితరులు పాల్గొన్నారు

## కామారెడ్డిలో రోడ్ల పునరుద్ధరణకు నిధులు మంజూరు

-మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్పు ఉమారాణి

కామారెడ్డి, సెప్టెంబర్ 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఎస్డీఆర్ఎఫ్ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షల నిధులను మంజూరు చేసిందని మున్సిపల్ ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి తెలిపారు. మంగళవారం సంబంధిత పనులను ఆమె ప్రారంభించారు. ఛైర్పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో వరద వల్ల దెబ్బతిన్న రోడ్ల ప్యాచ్ వర్క్స్, ఇతర రహదారుల పునరుద్ధరణ పనుల కోసం రూ.32.12 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే గతంలో తుఫాను సమయంలో ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డు పునరుద్ధరణ కోసం రూ.7.88 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మంజూరైన నిధులతో రోడ్లను త్వరితగతిన పునరుద్ధరిస్తామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, కలెక్టర్, అదనపు కలెక్టర్కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్పర్సన్ కాసర్ల గోదావరి, కమిషనర్ పర్వతాలు, కౌన్సిలర్లు సుల్తానా యునుస్, డీఈ హన్మంతరావు, ఏఈ వేణు ప్రసాద్ పాల్గొన్నారు.

# వానాకాలం (ఖరీఫ్) ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

-అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ :

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి : (తెలంగాణ పత్రిక) సెప్టెంబర్ 29



జయశంకర్ భూపాలపల్లి మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, డీఆర్డీఓ, పోలీస్, తూనికలు--కొలతలు, రవాణా శాఖల అధికారులు, రైస్మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి పంటకు మద్దతు ధర అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సాధారణ వరి రకాలు, ప్రత్యేకంగా గుర్తించాల్సిన ఏడు రకాల వరి రకాలను సక్రమంగా వర్గీకరించేందుకు సాంపిల్స్ తో పాటు పర్యవేక్షకులను నియమించాలని సూచించారు. రాష్ట్రస్థాయి మార్గదర్శకాలపై స్పష్టత తీసుకుని వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. ధాన్యం రవాణా చేసే వాహనాలు టెండర్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, అన్ని వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం నాణ్యతకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలపై రైతులకు, సిబ్బందికి అవగాహన కల్పించాలని, ప్యాడీ క్లీనర్లను సక్రమంగా వినియోగించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను తెచ్చే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ట్రక్ షీట్ నిర్వహణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. లారీలో లోడ్ చేసిన ధాన్యం బస్తాల సంఖ్య, బరువు తదితర వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి రైతులకు వెంటనే రశీదు అందించాలని ఆదేశించారు. వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, లోతట్టు ప్రాంతాల్లో కాకుండా సురక్షిత ప్రదేశాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో కనీసం నలుగురు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడడంతోపాటు తాగునీరు, నీడ, విద్యుత్ తదితర కనీస సౌకర్యాలతో రీజిస్టర్లు నిర్వహించాలని స్పష్టం చేశారు. రవాణాలో ఇబ్బందులు కలిగిస్తే బ్లాక్లిస్ట్లో పెడతామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులు పంటలకు మద్దతు ధర పొందేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో 86,936 ఎకరాల్లో సన్నరకం,13645 ఎకరాల్లో ధాన్యం సాగు జరిగిందని మొత్తం 1,05,400 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉన్నట్లు తెలిపారు. రైతులకు ఫిర్యాదుల కొరకు జిల్లా కంట్రోల్ రూము నంబర్ 9390350142, రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ 1967/18004250033 నంబర్లు కు కాల్ చేయొచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఆయా శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రికి తలకొరివి పెట్టిన పదహారేళ్ల కూతురు!

-చిన్న వయసులోనే తీరని విషాదం.. కన్నీరు మున్నీరైన కుటుంబం

-నిరుపేద కుటుంబానికి దాతలు అండగా నిలవాలని నాయి బ్రాహ్మణ సంఘం విజ్ఞప్తి

నంగునూరు, సెప్టెంబర్ 29(తెలంగాణ పత్రిక)





తండ్రి ప్రేమను ఆస్వాదిస్తూ ఆడుకోవాల్సిన వయసులో ఆ చిన్నారి జీవితంలో అంతులేని విషాదం అలుముకుంది. తండ్రి చేయూతతో చదువులో ముందుకు సాగాల్సిన పదహారేళ్ల బాలికకు విధి తీరని అన్యాయం చేసింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి ఆకస్మికంగా మృత్యువాత పడటంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. తండ్రి మృతదేహం ముందు కన్నీరుమున్నీరుగా విలపించిన ఆ చిన్నారి.. చివరకు తండ్రికి తలకొరివి పెట్టాల్సి రావడం అక్కడికి వచ్చిన వారందరినీ కంటతడి పెట్టించింది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాలపేటకు చెందిన రాచకొండ మంగలి మహేశ్ బైక్ మెకానిక్గా కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. సిద్దిపేటలోని కోటిలింగాల గుడి సమీపంలోని కాళ్ల కుంట రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య అనుజ, కుమార్తె కళ్యాణి ఉన్నారు. మహేశ్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా గుండె పోటుకు గురై మరణించారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా దూరం కావడంతో భార్య, కుమార్తె దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మహేశ్ ఏకైక సంతానమైన కళ్యాణి ప్రస్తుతం సిద్దిపేటలోని ఇందిరా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చదువుకుని కుటుంబానికి అండగా నిలవాల్సిన ఆ చిన్నారి.. నేడు తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగి పోయింది. తండ్రి మృతదేహం వద్ద ఆమె రోదించిన తీరు అక్కడున్న వారి హృదయాలను కలచివేసింది. సంప్రదాయం ప్రకారం తండ్రికి తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు నిర్వహించిన కళ్యాణిని చూసి అంత్యక్రియలకు హాజరైన వారు కన్నీటి పర్యంతమయ్యారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించిన మహేశ్ మరణంతో ఆ కుటుంబం ఆర్థికంగా మరింత ఇబ్బందుల్లో పడింది. ఇప్పటికే నిరుపేదరికంలో ఉన్న ఆ కుటుంబానికి ఇప్పుడు జీవనాధారం కరువైంది. భర్తను కోల్పోయిన అనూజకు, తండ్రిని కోల్పోయిన కళ్యాణికి భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది. ముఖ్యంగా పదో తరగతి చదువుతున్న కళ్యాణి విద్యాభ్యాసం నిరాటంకంగా కొనసాగాలంటే దాతలు, మానవతా వాదులు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి చేయూత అందించాల్సిన అవసరం ఉంది. ఈ విషాదకర ఘటనపై సిద్దిపేట జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొత్వాల్ యాద నరేందర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన అనూజ, కళ్యాణిలను ఆదుకోవాలని దాతలకు విజ్ఞప్తి చేశారు. తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ముఖ్యంగా తండ్రిని కోల్పోయిన కళ్యాణి చదువు ఆగిపోకుండా మానవతా వాదులు సహకరించాలని పిలుపునిచ్చారు. 8008808943, 9949245610 నంబర్లకు ఫోన్పే లేదా గూగుల్ పే ద్వారా తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అందించే ప్రతి చిన్న సహాయం వారి జీవితాల్లో కొత్త ఆశను నింప గలదు. తండ్రిని కోల్పోయిన ఆ చిన్నారి చదువుకు భరోసా కల్పించి, కన్నీటిలో మునిగిన ఆ కుటుంబానికి మనమంతా మానవత్వంతో అండగా నిలుద్దాం.

# సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు పోషణ మాసం అవగాహన కార్యక్రమం

చెన్నూర్, తెలంగాణ పత్రిక , సెప్టెంబర్ 29:



పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా చెన్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్, కిష్టంపేట సెక్టార్ లోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సి డి పి ఓ సంకీర్తన, సూపర్వైజర్ మాధవి హాజరై పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని, పిల్లలకు రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వయస్సుకు తగిన ఆహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భధారణ సమయంలో వైద్యుల సూచనలను పాటిస్తూ సమతుల్య ఆహారం తీసుకోవాలని, ఐరన్, కాల్షియం వంటి అవసరమైన పోషకాలు అందేలా ఆహారపు అలవాట్లను మెరుగుపరుచుకోవాలని వివరించారు. ప్రసవానంతరం బాలింతలు కూడా తగినంత పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు శిశువుకు తల్లిపాలను అందించడం ద్వారా బిడ్డ ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడాలని సూచించారు.కిశోర బాలికలు పోషకాహార లోపానికి గురికాకుండా చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి ఆరోగ్య నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావుల సునీత, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పోషణ అభియాన్ బి సి నగేష్, ఉమెన్స్ క్లబ్ మెంబెర్స్ విజయ, లిప్సిక, అంగన్వాడీ టీచర్లు , అంగన్వాడీ హెల్పర్స్, ఆశ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరిన బిబి పేట వంతెనకు మరమ్మతులు చేపట్టాలి

**-ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోని అధికారులు**

**-తాజా మాజీ ఎంపీటీసీ భర్త కొరివి నర్సింహులు**

కామారెడ్డి ,సెప్టెంబర్ 29, (తెలంగాణ పత్రిక జిల్లా)





గతేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాబీబీపేట మండల పరిధిలో దెబ్బతిన్న వంతెనకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజాం కాలం నాటి ఈ వంతెన ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని గుర్తు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సమస్యను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టలేదని తాజా మాజీ ఎంపీటీసీ భర్త, ముదిరాజ్ నాయకుడు కొరివి నర్సింహులు ఆరోపించారు. దెబ్బతిన్న వంతెనపై ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలతో పాటు భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తున్నాయని, దీంతో వంతెన మరింత బలహీనపడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. వర్షాలు కురిసిన సమయంలో నీటి ప్రవాహం కారణంగా వంతెన లోపలి భాగం దెబ్బతిని క్రమంగా కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు వార్తలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పలుమార్లు వంతెనను పరిశీలించి వెళ్లారని, అయినా పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. బీబీపేట మండలానికి ఈ మార్గం ప్రధాన రహదారిగా ఉండటంతో వంతెన కూలిపోతే చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇస్సానగర్, ఉప్పరపల్లి, తుజాల్‌పూర్, షేర్‌బీపేట, రాంపూర్, నస్కల్, యాడారం, జనగామ, సీతారాం పల్లి తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. వంతెన పూర్తిగా కూలిపోయిన తర్వాత కొత్తగా నిర్మాణం చేపట్టడం వల్ల సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే నిధులు మంజూరు చేసి మరమ్మతు పనులు ప్రారంభించాలని కొరివి నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే బలమైన కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వంతెనపై అవసరమైన భద్రతా చర్యలు చేపట్టి, రాత్రివేళల్లో ప్రమాదాలు జరగకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని కూడా ఆయన సూచించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు.

# జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వృద్ధ తల్లిదండ్రులకు దక్కిన న్యాయం





మిర్యాలగూడ ప్రతినిధి//సెప్టెంబర్ 29:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సింగం యాదమ్మ భర్త అంజయ్య రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ చైతన్య నగర్ మిర్యాలగూడ పట్టణం 65 సం. వయోవృద్ధులు వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు చనిపోయారు ఒక కుమార్తె వీరికి విద్యాభ్యాసం పెళ్లిళ్లు బాధ్యతలు అన్ని నిర్వర్తించడం జరిగింది వీరికి వ్యవసాయ భూమి పెద్దదేవులపల్లి త్రిపురారం మండలంలో కలదు వీరికి ఒక నివాసము మిర్యాలగూడ పట్టణంలోని చైతన్య నగర్ రోడ్ నెంబర్ 7 నందు ఇళు ్ళ కలదు ఇట్టి ఇంటి ని గత పది 12ఏళ్లుగా నివసిస్తూ కుమారుడికి పట్టా చేయడంతో గతనెల ఆర్టీవో ట్రిబ్యునల్ నందు సీనియర్ సిటిజన్ ఆక్ట్ 2007 ప్రకారం బ్రతికున్నంత కాలం ఆ ఇంటిలో నివసించడానికి కేవలం ఉండడానికి మాత్రమే ఆశ్రయం ఇవ్వాలని కోరడం జరిగింది. అ ఇంటి లో కుమారుడు రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కొట్టడం తిట్టడం మరియు వారికి భౌతికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గత నెల ప్రజావాణికి రావడంతో జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ఐఏఎస్ ఆర్డిఓ కి కేసు పైన విచారణ జరిపి త్వరితగతిన ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరడంతో ఆర్డీవో కే రమణారెడ్డి గత నెల విచారణ నిర్వహించి తల్లిదండ్రులను రానివ్వకుండా ఇబ్బంది చేస్తున్నారని తల్లిదండ్రులు వారికి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామని మేము మా కుమారుడికి పట్టా చేసిన ఇంటి నందు ఉండడానికి ఆశ్రయము. కల్పించాలని ఇంటి నందు కుమారుడు కూడా ఉండడం లేదని మమ్మల్ని ఉండనివ్వకుండా ఖాళీగా ఉంచుతున్నాడని అది నిరుపయోగం గా ఉన్నదని, పనికి రాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20 వ తేదీన ఇట్టి ఉత్తర్వులను అమలు పరచవలసిందిగా స్థానిక ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి కోరడంతో ఉత్తర్వుల అమలులో భాగంగా స్థానిక సీఐ నాగభూషణం సీడీపీఓ వేణు మరియు రెవిన్యూ శాఖ మరియు మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ అందరు కలిసి ఆ వయోవృద్ధులని వారి ఇంటిలో ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజు రాజశేఖరరెడ్డి, మున్సిపల్ సిబ్బంది సాజిద్ సాంబయ్య రెవిన్యూ శాఖ నుండి రాజు నాగిరెడ్డి నవీన్ సునీల్ అంగన్వాడి టీచర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు





**-ఐదవ షెడ్యూల్ పరిరక్షణకై ఉద్యమిద్దం**

**-అక్టోబర్ 5న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేద్దాం**

**-ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ**

**-1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలి**

**-ఏజెన్సీ ప్రాంతంలో 100% ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలి**

**-జీవో నెంబర్ 3 ను పునరుద్ధరించి చట్టం చేయాలి**

**-ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర వలసలు నిరోధించాలి**

**-ఏజెన్సీ ప్రాంతంలో పిసా గ్రామ సభలు ద్వారా మాత్రమే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి**

**-ఏజెన్సీలో 1970 తర్వాత గిరిజనేతలకు చేసిన అక్రమ పట్టాలు రద్దు చేయాలి**

వెంకటాపురం. (నూగురు) సెప్టెంబర్ 29 : తెలంగాణ పత్రిక ::

ఆదివాసీల హక్కుల పరిరక్షణకై ఆదివాసీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకులపై ఉద్యమించాలని ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి నాయకులు తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు యాసం రాజు, ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి, గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనం సాయి, ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పర్సిక సతీష్, ఆదివాసి మహిళ విభాగం అధ్యక్షురాలు జెజ్జరి నారాయణమ్మ పిలుపునిచ్చారు. ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం రోడ్డు భవనాల విశ్రాంతి భవనం నందు ఏర్పాటు చేసుకొని మాట్లాడారు. ఈ సమావేశానికి గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనం సాయి అధ్యక్షత వహించారు.ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పూనం శ్రీనివాస్ ఆధ్వర్యంలో తలపెట్టిన భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ముట్టడికి వేలాదిగా ఆదివాసులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసి ప్రజానీకానికి తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్ట విరుద్ధంగా ఏజెన్సీ లోకి వలస వచ్చి ఏజెన్సీ ప్రాంత వనరులను అక్రమంగా దోచుకుంటున్నారని ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఏజెన్సీ లోకి గిరిజనేతర వలసలు నిరోధించాలని చట్టంలో స్పష్టంగా పేర్కొనబడి ఉన్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పాలకులు ఆదివాసి చట్టాలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 1970 తర్వాత గిరిజనేతరులకు చేసిన అక్రమ పట్టాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనేతర ఓట్ల రాజకీయాల కోసం ఆదివాసుల చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ప్రశ్నించారు. స్వతంత్రం వచ్చి 80 ఏళ్లకు చేరువ అయిన ఆదివాసులకు అభివృద్ధి మాత్రం శూన్యమే అని అన్నారు. గిరిజన ప్రాంత నిధులతో వెంకటాపురం మండల కేంద్రంలో గిరిజనేతరుల ఇండ్ల చుట్టూ విశాలవంతమైన రోడ్లు వేస్తూ గిరిజనులు ఉండే గ్రామాలలో నేటికీ దయనీయమైన రోడ్ల పరిస్థితి ఉందని ఆగ్రహించారు.1/70 చట్టం పటిష్ట అమలు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాలు ముట్టడి ఉంటుందని ప్రభుత్వానికి తెలియజేశారు. ఆదివాసి చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి చట్టాల ప్రతిష్ట అమలు కోసం మరో శ్రీకాకుళ ఉద్యమానికి ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉంటుందని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి ఆదివాసి ప్రజలు మేధావులు ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు పూనం ప్రతాప్, ఆదివాసి నవనిర్మాణ సేన జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి కుచ్చింటి చిరంజీవి, కనితి వెంకటకృష్ణ తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు, కణితి విజయ్ ఆదివాసి నవ నిర్మాణ సేన ములుగు జిల్లా ఉపాధ్యక్షులు, వాసం నారాయణ వెంకటాపురం మండల అధ్యక్షులు, ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల అధ్యక్షుడు తుర్సా కృష్ణ బాబు, ఆదివాసి నవనిర్మాణ సేన మండల ఉపాధ్యక్షులు కణితి శంకర్, ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు,తుర్సా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# జుట్టు తిరుపతి నివాసానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**-అనారోగ్యంతో ఉన్న పద్మమ్మను పరామర్శించిన ఎమ్మెల్యే**



తెలంగాణ పత్రిక (కల్వకుర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 29 -- తలకొండపల్లి):

తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుడు జుట్టు తిరుపతి ముదిరాజ్ నివాసానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం విచ్చేశారు.ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యానికి గురై స్టంట్ వేయించుకున్న జుట్టు తిరుపతి భార్య పద్మమ్మను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.అనంతరం స్థానిక సమస్యలు, మండలంలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు, వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చినట్లు కాసు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పాపన్నపేటకు చెందిన నిజామొద్దీన్‌కు ఆర్థిక సాయం

**-పాపన్నపేట సర్పంచ్ లింగంపేట పావని నరేందర్ గౌడ్**



పాపన్నపేట,సెప్టెంబర్ 29:(తెలంగాణ పత్రిక)

మండలకేంద్రమైన పాపన్నపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నిజామొద్దీన్‌కు కాలికి శస్త్రచికిత్స చేయించుకునేందుకు రూ.75 వేల ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది.ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు ఇబ్బందితో బాధ పడుతున్న నిజామొద్దీన్‌కు ప్రభుత్వం నుంచి ఎల్వోసీ మంజూరు కావడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.కాలికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో చికిత్స కోసం ఎల్వోసీకి దరఖాస్తు చేసుకోగా రూ.75 వేల విలువైన ఎల్వోసీ మంజూరైనట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి, సహకరించిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సుఫీ,మైనార్టీ మండల అధ్యక్షులు ఖలీం, ప్రజాప్రతినిధులు, అధికారులకు నిజామొద్దీన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మండల మైనార్టీ నాయకులను సన్మానించిన మండల అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్




గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 29

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రకటింపబడిన మండల మైనార్టీ సెల్ అధ్యక్షునిగా మహమ్మద్ యాసిన్ పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ హష్మీ జిల్లా కార్యదర్శిగా మహమ్మద్ యాదుల్లా మహమ్మద్ ఇక్బాల్ ని నియమించిన సందర్భంగా మండల అధ్యక్షులు తిరుమల తిరుపతి గౌడ్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మైనార్టీ సంక్షేమం కోసం పాటుపడాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ మల్యాల రాజు వీర్ మాజీ మండల అధ్యక్షులు హమీద్ మండల ఉపాధ్యక్షులు బంగ్లా రాజు గౌడ్ జోగు సురేష్ ఎండి తహర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు ఘన ఏర్పాట్లు చేయాలి కూన శ్రీశైలం గౌడ్



తెలంగాణ పత్రిక, సిరిసిల్ల, సెప్టెంబర్ 29:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పట్టణంలో బుధవారం నిర్వహించనున్న పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో ఆయన మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు ప్రజలను తరలించడం, జన సమీకరణ, సభా ప్రాంగణ ఏర్పాట్లు, ఇతర కార్యక్రమాల నిర్వహణపై నాయకులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చేలా అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. పర్యటన విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిగే రాజు, సర్ కోఆర్డినేటర్ ప్రవీణ్ టోనీతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతనంగా ఏర్పాటు చేసిన దీక్షిత భోజనశాల హోటల్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు

మిర్యాలగూడ ప్రతినిధి//సెప్టెంబర్ 29:(తెలంగాణ పత్రిక):-







మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా నందు నూతనంగా ఏర్పాటు చేసిన దీక్షిత భోజనశాల హోటల్‌ను మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకుల ధనావత్ వీరా నాయక్ ను అభినందించి, హోటల్‌లో అందిస్తున్న సదుపాయాలు, భోజన నాణ్యత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ప్రారంభించిన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని, ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎండి యూసుఫ్, దుర్గంపూడి నారాయణరెడ్డి, ఆంగోతు హాతిరాం నాయక్ ,కొందూరు వీర కోటిరెడ్డి, సోము సైదిరెడ్డి, ధనావత్ వీరా నాయక్, ఆడోత్తులింగా నాయక్, సీతారాములు, అక్కురాం, ఎల్లయ్య, కందుల నాగిరెడ్డి, బచ్చు సాయన్న, బాలనాయక్, శోభన్ నాయక్, రమావత్ వినోద్ నాయక్, రఫీ బాయ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, హోటల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటర్లందరూ తమ ఓటును వెంటనే నమోదు చేసుకోవాలి

-మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

మిర్యాలగూడ ప్రతినిధి//సెప్టెంబర్ 29:(తెలంగాణ ప్రతినిధి):-



మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తమ ఓటును తప్పని సరిగా నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇంచార్జ్ నల్లమోతు భాస్కర్ రావు విజ్ఞప్తి చేశారు. తాను కూడా ఈరోజే తన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా మిర్యాలగూడ నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులు ఎలాంటి ఆలస్యం చేయకుండా తక్షణమే తమ పేర్లను పట్టభద్రుల ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగానే నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని భాస్కర్ రావు సూచించారు. నేను నా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును ఈరోజే నమోదు చేసుకున్నాను. మీరు కూడా ఆలస్యం చేయకుండా మీ ఓటును వెంటనే నమోదు చేసుకోండి" అని పట్టభద్రులకు ఆయన పిలుపునిచ్చారు.

# బాన్సువాడలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు ప్రారంభం





-జర్నలిస్టులు నా బిడ్డలతో సమానం

-ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

-బాన్సువాడలో జరిగిన అభివృద్ధి రాష్ట్రంలో ఎక్కడా జరగలేదు

-మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి ,సెప్టెంబర్ 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా జర్నలిస్టులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం బాన్సువాడలోని డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బాన్సువాడలో జరిగిన అభివృద్ధి రాష్ట్రంలో మరెక్కడా జరగలేదని పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులకు సమీపంలో ఉన్న బాన్సువాడలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించడం ఎంతో ప్రయోజనకరమన్నారు. సీనియర్ జర్నలిస్టుల అనుభవాలను పంచుకోవడం ద్వారా వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావం, దాని ఆవిర్భావం, వార్తల విశ్వసనీయతపై జర్నలిస్టులు చర్చించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వార్తలు రాసేటప్పుడు వాస్తవాలను నిర్ధారించుకోవాలని, ప్రజల విశ్వాసాన్ని కాపాడాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఊ×) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. జర్నలిస్టులు వృత్తిపరమైన హద్దులను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుగా పనిచేయడం కత్తి మీద సాము లాంటిదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను నిర్వహిస్తుంటే, జర్నలిస్టులు ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజల ముందుకు తీసుకెళ్లే కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి మాట్లాడే అంశాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజాప్రతినిధులు తప్పు చేసినప్పుడు వాటిని ఎత్తిచూపే బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు సకాలంలో సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు. పత్రికల ద్వారా ప్రజలకు అనేక విషయాలు తెలుస్తాయని, జర్నలిజం పవిత్రమైన వృత్తి అని అన్నారు. జర్నలిస్టులు తన బిడ్డలతో సమానమని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఎల్ నినో ప్రభావంపై జర్నలిస్టులు రాసిన వార్తలను తాను చదివానని, జర్నలిస్టులు వార్తలు రాయడం తమ బాధ్యత కాగా, వాటిని చదివి తెలుసుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. శిక్షణ తరగతుల్లో భాగంగా, మంగళవారం ఉదయం సమాచార హక్కు చట్టం (RTI)పై దిలీప్ రెడ్డి జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. అనంతరం నేర వార్తలకు సంబంధించిన అంశాలపై గోవింద్ రెడ్డి శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్నం సెషన్‌లో వార్తా కథనాలు, ప్రత్యేక కథనాల రచనపై దిశ ఎడిటర్ మార్కండేయ శిక్షణ అందించారు. అనంతరం ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, ఏ1, సోషల్ మీడియా అంశాలపై ముద్దం నరసింహ స్వామి జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, కామారెడ్డి ఆర్డీఓ రవీందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, టీజీ ఆగ్రో మాజీ చైర్మన్ కాసుల బాలరాజు, కామారెడ్డి అధ్యక్షులు వీర మాచినేని రజనీ కాంత్, కౌన్సిల్ సభ్యులు సేపూరి వేణుగోపాల్ చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఏ. లతీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు పట్నం శ్రీనివాస్, కార్యదర్శి బైరి సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్ట్ కాలనీలో పర్యటన

శిక్షణ తరగతులకు ముందు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడలోని జర్నలిస్ట్ కాలనీలో పర్యటించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం, కాలనీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పట్ల మీడియా అకాడమీ చైర్మన్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని అభినందించారు.

# కేటీఆర్ ఆరోపణలు పచ్చి అబద్దాలు

-రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

రాజేంద్రనగర్ ప్రతినిధి సెప్టెంబర్ 29 తెలంగాణ పత్రిక.



మాజీ మంత్రి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలు అని రాజేంద్రనగర్ శాసనసభ సభ్యుడు ప్రకాష్ గౌడ్ మంగళవారం నాడు శంషాబాద్ పట్టణంలో మీడియా సమావేశంలో తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా శంషాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల విషయంలో తాను పోరాడుతూనే ఉన్నానని ముఖ్యమంత్రిని మంత్రులను కలుస్తూనే ఉన్నానని తెలిపారు. శంషాబాద్ భూ సమస్యల నిమిత్తం కేటీఆర్ ను ఎన్నడూ కల్వనే లేదు అని అసత్య ఆరోపణలు చేయడం కేటీఆర్ కు సమంజసం కాదని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కేటీఆర్ పై తీవ్రంగా మండిపడ్డారు. శంషాబాద్ మండలంలోని బహదూర్గుడ భూములకు సంబంధించి గన్సీయగూడ భూములకు సంబంధించి భూ సమస్యలపై ముఖ్యమంత్రిని మంత్రులను సంప్రదించినట్లు తెలిపారు. 2022 డిసెంబర్ లో అప్పా జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన ఎయిర్పోర్ట్ మెట్రో శంకుస్థాపన సభలో శంషాబాద్ భూ సమస్యలను అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ కు కేటీఆర్ కు తెలిపినట్లు ఆధారాలను ప్రవేశపెట్టారు. శంషాబాద్ లో ఉన్న బహదూర్గుడా భూమిలే కాక కొత్వాలు గూడ లో ఉన్న ఎనిమీ ప్రాపర్టీస్ గురించి భూదాన్ భూముల్లో సుల్తాన్పల్లి మల్కారం గ్రామాలలో ఉన్న సమస్యలు నిమిత్తం కూడ ముఖ్యమంత్రిని మంత్రులను పలుమార్లు కలిసి వినతి పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్ననాటి కాలం నుంచి భూ సమస్యల గూర్చి పోరాడుతున్నట్లు సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. అసెంబ్లీలో కూడ పలుమార్లు భూ సమస్యల నిమిత్తం ప్రస్తావించినట్లు తెలిపారు. అప్పటి చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ నివాసానికి స్వయంగా వెళ్లి శంషాబాద్ మండల భూ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేసిన ఆధారాలను దానికి సంబంధించిన లేఖలను తన వద్ద ఉన్నట్లు మీడియా సమావేశంలో వాటిని ప్రవేశపెట్టారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజల తరఫున రైతుల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణేష్ గుప్తా, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్,సీనియర్ నాయకులు చంద్ శంషాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుచిలకమర్రి మహేందర్,పాలమకుల గ్రామ సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్, చిన్న గోల్కొండ మాజీ పిఏసిఎస్ చైర్మన్ దవణాకర్ గౌడ్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్ గౌడ్, చౌదరిగుడా సర్పంచ్ మల్చలం లక్ష్మి లింగం, కుక్కల బాలు జూరికి రమేష్ పటేల్,వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు..

# జన గణనలో ఓబీసీ కాలము చేర్చాల్సిందే

-40 ప్రశ్నలతో జారీ చేసిన కులగణన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి.......

-బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ ప్రతినిధి//సెప్టెంబర్ 29:(తెలంగాణ పత్రిక):-



జాతి జనగణలో ఎస్సీ,ఎస్టీ లతోపాటు ఓబీసీ కాలమును కూడా చేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఓబిసి చేపడతామని హామీ ఇచ్చి ఈరోజు ఆ యొక్క హామీని విస్మరించిందని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సినటువంటి మిగతా పార్టీలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయని అన్నారు. జనగణన పై జాతీయ స్థాయిలో అఖిలపక్ష పార్టీల మేధావుల కుల సంఘాల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే 40 ప్రశ్నలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని అన్నారు. బిజెపి ప్రభుత్వం పూర్తి బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, రాంబాబు యాదవ్, నక్క నాగరాజు, తాడూరి సైదులు, తదితరులు పాల్గొన్నారు

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

# సకాలంలో ఓ పాజిటివ్ రక్తం అందజేత

**-రక్తదానం పైన అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తాం**

**-ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా నిర్వహణ సభ్యులు డాక్టర్ బాలు**

కామారెడ్డి, సెప్టెంబర్ 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కోమలి (24) విద్యార్థి రక్తహీనతతో బాధపడుతుండడంతో వారి కుటుంబ సభ్యులు ఓ పాజిటివ్ రక్తం కావాలని సంప్రదించడంతో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా నిర్వహణ సభ్యులు డాక్టర్ బాలు వారికి కావాల్సిన రక్తాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేయడానికి రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సిద్ధంగా ఉన్నామని,రక్తదానం పైన అవగాహన కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. కామారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ సేవా సంస్థను కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసం,కాలక్షేపం కోసం, కొందరు ప్రభుత్వ ఉద్యోగులు వారి ఉద్యోగాలకు వెళ్లకుండా ఉండడం కోసం మాత్రమే పదవులను పొంది ఆపదలో ఉన్న వారికి మాత్రం సహాయం చేయడం లేదని అన్నారు. రెడ్ క్రాస్ సంస్థను పునరావాస కేం ద్రంగా మార్చారే తప్ప ఏ రోజైనా తల సేమియా బాధిత చిన్నారుల కోసం కానీ, రోడ్డు ప్రమాద బాధితులకు కానీ,గర్భిణీ స్త్రీలకు కోసం కానీ,కరోనా వ్యాధి సమయంలో కానీ ఏనాడు కామారెడ్డి ప్రజల కోసం సేవ చేయని వ్యక్తులే పదవులను పొందడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. పేరు పక్కన రెడ్ క్రాస్ పదవులు రాసుకోవడానికి,కార్ల పైన రాసుకోవడానికి



మాత్రమే ఉపయోగపడుతున్నాయే ఆపదలో ఉన్న వారికి మాత్రం ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు.పదవులు ఉన్నా లేకున్నా ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేయడానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి







**-జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.**

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది సెప్టెంబర్ 29:

2026--27 సీజన్‌లో జిల్లాలోని రైతుల నుంచి వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి తో కలిసి కొనుగోలు కేంద్రాల నిర్వహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 135 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు లోబడి మాత్రమే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన 7 సన్న రకాల ధాన్యానికి 5204, 15048, 1638, 44, 7715) మాత్రమే క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఎ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు 2 వేల 461 రూపాయలు, సి గ్రేడ్ ధాన్యానికి 2 వేల 441 రూపాయలుగా ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రము వద్ద నాణ్యత ప్రమాణాలు, మద్దతు ధర సూచించే ప్రత్యేక బ్యానర్ ను ప్రదర్శించాలని తెలిపారు. ధాన్యాన్ని తెచ్చిన రైతుల వివరాలను వెంటనే ప్రత్యేక రిజిష్టరులో వ్రాసి, ధాన్యాన్ని తెచ్చిన దినము నుండి ప్రతిదినము తేమ కనిష్ట స్థాయి అనగా 17% వచ్చేవరకు పరిశీలించి రోజువారీగా రిజిష్టరులో నమోదు చేయాలని సూచించారు. ధాన్యాన్ని తూకం వేయించే విషయంలో ఎటువంటి అక్రమాలకు, వరుసక్రమ ఉల్లంఘనలకు, తేమరాని ధాన్యాన్ని తూకం వేయడం మొదలగు అవకతవకలకు పాల్పడకుండా సెంటర్ నిర్వహించుటకు భాద్యత వహించాలని, కేంద్ర నిర్వాహకుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రిమినల్ కేసువంటి తీవ్ర చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే లో నమోదు చేయాలని, తదుపరి వివరములన్ని అచ్చువేసిన రిజిస్టర్ లో నమోదు చేయలన్నారు. ధాన్యం రవాణా కోసం ట్రా పరికరం అమర్చిన వాహనాలను మాత్రమే ఉపయెగించాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు, ఆలస్యం కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఎస్ పి రవీందర్, డి ఆర్ డి ఓ రవీందర్, డి సి ఓ రామ్ మోహన్, డి ఎ ఓ సురేష్ కుమార్, డి హెచ్ ఓ సంజీవరావు, డిఎం, డిసిఎస్ఓ కృష్ణవేణి, జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, సంబంధిత అధికారులు, ఐకెపి, పిఏసిఎస్, జిసిసి, ఎంఎసిసి సెంటర్ల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏహెచ్ఎస్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో







తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది సెప్టెంబర్ 29:

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ఐఏఎస్ మంగళవారం రామంజాపూర్‌లోని ఏహెచ్ఎస్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఓ పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న బోధనా విధానం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల రికార్డులు, అకాడమిక్ సంబంధిత వివరాలను కూడా పరిశీలించారు. విద్యార్థులు విద్యలో ముందుకు సాగేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పీఓ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన మరియు ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సమస్యలు మరియు అవసరాలపై సిబ్బందితో పీఓ వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, అవసరమైన సౌకర్యాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పీఓ ఆకస్మిక తనిఖీ సందర్భంగా పాఠశాల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసిన వేముల మహేందర్ గౌడ్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి :( తెలంగాణ పత్రిక) సెప్టెంబర్ 29

తెలంగాణ మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖను బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు, కొండా దంపతుల వీరాభిమాని వేముల మహేందర్ గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రివర్గం నుంచి ఆమెను తొలగించిన అనంతరం తొలిసారిగా ఆయన కొండా సురేఖను కలుసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.దహన్మకొండలోని రామ్ నగర్‌లో ఉన్న కొండా సురేఖ నివాసానికి వెళ్లిన వేముల మహేందర్ గౌడ్ ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొండా సురేఖతో కొద్దిసేపు మాట్లాడి ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, వరంగల్ ప్రాంతానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మహేందర్ గౌడ్ పేర్కొన్నారు. అలాగే కొండా దంపతులు వరంగల్ ప్రాంత ప్రజల కోసం చేసిన సేవలు, ప్రజా సమస్యలపై వారు నిర్వహించిన కార్యక్రమాలను తాను ఎప్పటి నుంచో గమనిస్తున్నానని తెలిపారు. కొండా సురేఖను కలిసిన అనంతరం మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. “కొండా దంపతులపై తనకు ప్రత్యేక అభిమానం, గౌరవం ఉందని, ప్రజా సమస్యలపై వారు చేస్తున్న కృషికి ఎల్లప్పుడూ నా మద్దతు ఉంటుంది” అని పేర్కొన్నట్లు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా ఇరువురు పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

**-రికార్డులు, కేసు ఫైళ్లను పరిశీలించిన కల్వకుర్తి డీఎస్పీ వెంకట్ రెడ్డి**



తెలంగాణ పత్రిక (కల్వకుర్తి ప్రతినిధి):

వార్షిక తనిఖీల్లో భాగంగా కల్వకుర్తి డీఎస్పీ శ్రీ వెంకట్ రెడ్డి కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, కేసులకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఎస్ఐ కురుమూర్తితో కలిసి నమోదైన కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిస్థితి, రికార్డుల నిర్వహణ తీరును డీఎస్పీ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి భద్రపరచాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను బాధ్యతగా స్వీకరించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎస్పీ వెంకట్ రెడ్డి ఆదేశించారు.తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత తదితర అంశాలను కూడా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# మాదిగ మహిళా సమైక్య రాష్ట్ర కార్యదర్శి సత్తిగారి లక్ష్మి , లావణ్య లకు ఘన సన్మానం



కామారెడ్డి, సెప్టెంబర్ 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లామాదిగ మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతూ, రాజకీయ సామాజిక పోరాటాల్లో ముందుండాలని రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్ట వెంకట రాములు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆశీస్సులతో.. మాదిగ మహిళా సమైక్య కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన భానుపురం లావణ్య నియామకాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత మాదిగ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం కామారెడ్డి పట్టణంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మాదిగ మహిళా సమైక్య ఆధ్వర్యంలో నూతన జిల్లా అధ్యక్షురాలు భానుపురం లావణ్య ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బక్క గణేష్, భూపతి, రవీంద్ర, మాదిగ మహిళల సంక్షేమం, వారి హక్కుల సాధన కోసం సమైక్య నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దళిత, మాదిగ మహిళలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, సమాజంలో తగిన గౌరవం దక్కేలా ప్రతి ఒక్కరూ సైనికులా పనిచేయాలని కోరారు. నూతన జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన భానుపురం లావణ్య క్షేత్రస్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, మహిళల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తారనే పూర్తి నమ్మకం ఉందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

తెలంగాణ పత్రిక కరీంనగర్ సెప్టెంబర్ 29



కరీంనగర్: జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు, ఎంపికలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అండర్-14, అండర్-17 బాల బాలి కల విభాగాల్లో హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తున్నారు.దఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి బన్సీలాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో సుమారు 400 నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా స్థాయి ఎంపికల్లో భాగంగా క్రీడాకారుల ప్రతిభను పరిశీలించి అండర్-14, అండర్-17 విభాగాల్లో జిల్లా జట్లకు ఎంపికలు చేపట్టారు. పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కట్ట సంతోష్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, వీర్పాల్ శ్రీనివాస్ తదితర వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొని పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు. క్రీడాకారులకు అవసరమైన సూచనలు అందిస్తూ పోటీలు సజావుగా జరిగేలా నిర్వాహకులు చర్యలు చేపట్టారు.

## వలిగొండలో ఘనంగా సేవా సంకల్ప అభియాన్



తెలంగాణ పత్రిక వలిగొండ సెప్టెంబర్ 29.

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం టేకులసోమారం గ్రామంలోని సాధన మానసిక వికలాంగుల కేంద్రం ఆశ్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీజేపీ ఓబీసీ మోర్చా చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పదులది రాంచందర్ ఆధ్వర్యంలో ఆశ్రమంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ పాల్గొని ఆశ్రమంలోని వారికి ఆహారాన్ని అందించారు. సమాజంలో అట్టడుగున ఉన్నవారికి, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారికి అండగా నిలవడమే సేవా సంకల్ప అభియాన్ ముఖ్య ఉద్దేశమని అశోక్ గౌడ్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేయూతనివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన విధంగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పాలసీ సెల్ కన్వీనర్ సర్వీ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి పాల్గొన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు బలరాం, జిల్లా కార్యాలయ కార్యదర్శి మంగ నర్సింహారావు, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గెజిటెడ్ అధికారులను తనిఖీల పేరుతో ఆదేశించిన విద్యుత్ ఆపరేటర్ పై కలెక్టర్ ఆగ్రహం

-సమగ్ర విచారణ జరిపి విద్యుత్ ఆపరేటర్ ను సస్పెండ్ చేయాలని గెజిటెడ్ అధికారుల డిమాండ్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి : (తెలంగాణ పత్రిక) సెప్టెంబర్ 29 భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో తనిఖీల పేరుతో ఒక విద్యుత్ ఆపరేటర్ ఆయా ప్రభుత్వ కార్యాలయాలను సందర్శి ంచి ఏకంగా గెజిటెడ్ అధికారులనే ఆదేశించిన సంఘటన జిల్లావ్యాప్త ంగా చర్చనీయాం శమైంది. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలతో పాటు



మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో తనిఖీల పేరుతో ఒక విద్యుత్ ఆపరేటర్ ఆయా కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కు తగు సూచనలు ఇచ్చి ఆదేశాలను జారీ చేసినట్లు తెలియ వచ్చింది. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డాక్టర్ తో పాటు సిబ్బందిని బయటకు పిలిపించి వారికి కూడా ఆదేశాలు జారీ చేయడంతో అసలు ఇతను ఎవరు అని సంబంధిత అధికారులు ఆరా తీయగా..అసలు విషయం బయటకు పొక్కింది. దీంతో ఆ గెజిటెడ్ అధికారులు అవాక్కయ్యారు. ఇట్టి విషయమై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆరా తీసి, సదరు విద్యుత్ ఆపరేటర్ పై చర్యలు తీసుకునేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

## విద్యుత్ షాక్కు గురై మృతి చెందిన మేకలు

ఎలిగేడు, సెప్టెంబర్29 (తెలంగాణ పత్రిక):-

ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన న్యాతరి శంకర్ అనే రైతు తనకున్న మేకలలో రెండు మేకలు విద్యుత్ ట్రాన్స్ఫారం తీగలకు ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. విద్యుత్ షాక్ గురై మృతి చెందిన మేకలు



30 వేల రూపాయల రాక విలువ చేస్తుందని, ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

## పాపన్నపేటలో చేనేత సహకార సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం

-చైర్మన్ కొడపాక విట్టల్

పాపన్నపేట,సెప్టెంబర్29(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన పాపన్నపేట చేనేత సహకార సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం సంఘం చైర్మన్ కొడపాక విట్టల్ అధ్యక్షతన మంగళవారం పాపన్నపేట చేనేత సహకార సంఘం భవనంలో నిర్వహించారు. సమావేశంలో కొత్తగా చేనేత సభ్యత్వాలు నమోదు చేయాలని, చేనేత వృత్తి వారికి గుర్తింపు కార్డులు, కొత్త సభ్యులకు చేనేత హస్త కళకు సంబంధించి తగిన వృత్తి శిక్షణ కేంద్రాలు కలించి శిక్షణ కల్పించాలన్నారు. 50సం.లు నిండిన చేనేత సభ్యుల వివరాలు సేకరించి అందరికీ చేనేత పింఛన్లను మంజూరు చేయాలని కోరారు. చేనేత సంఘం భవనం వర్షానికి పూర్తిగా పాడై పోయినందున మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు.చేనేత భవనంకు నీటి సమస్య ఉన్నందున ప్రాంగణంలో నూతన బోర్ వేయించాలని నీటి కొరత ను తీర్చాలని సంఘం సభ్యులు వెల్లడించారు. భవనం పాతభవనం వర్షానికి దెబ్బ తిన్నందున,భవనంను తొలగించి తిరిగి వాడుకలోకి తీసుకు రావాలన్నారు.చేనేత భవనంలో ప్రస్తుతం అద్దె కు కొనసాగుతున్న ఐజల్ వాటర్ ప్లాంట్ ను కిరాయి డబ్బులు,పోస్ట్ ఆఫీస్ అద్దె డబ్బులు,బట్టల దుకాణం అద్దె డబ్బులు చెల్లించటం లేదని సెప్టెంబర్ నెలాఖరు వరకు చెల్లించనిచొ ఖాళీ చేయించాలని డిమాండ్ చేసారు. చేనేత వృత్తిలో వెనకబడిన కుటుంబాల విద్యార్థిని,విద్యార్థులకు పై చదువులకు ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేయాలని కోరారు. చేనేత వృత్తిలో కొనసాగుతున్న పద్మశాలి కుటుంబంలో



ఎవరైనా మరణించినచో వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.సమావేశం ప్రారంభంకు ముందు సంఘం డైరెక్టర్ లుగా పనిచేసి ఇటీవల మృతి చెందిన బీకొండ నారాయణ,బద్దాపురం రాములు,పద్మశాలి సంఘం కులసంఘం నాయకులు మరెల్లి రాములు కుటుంబాలకు సభ్యులు రెండు నిమిషాలు మైనం పాటించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ లు పల్లె సంగమేశ్వర,పల్లె లక్ష్మణ్,దాసరి యాదయ్య,అచుకట్ల గురునాధం,జూకంటి సంగయ్య,సభ్యులు కల్లేటి సంగమేశ్వర, వళ్ళందేశీ శ్రీనివాస్,బద్దపురం సంగమేశ్వర, పడిగే కిష్టయ్య,పోలశ్రీనివాస్, కొడపాక రాజేశ్వర్,పల్లె రామచందర్,వళ్ళం దేశీ బుచికుమార్,బీకొండ జోగయ్య,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల నేతన్నల ఆవేదన.. కేటీఆర్ నాయకత్వంపై అచంచల విశ్వాసం!



తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్

ఎన్టీఆర్ మొదలుకొని చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి వరకు ఉమ్మడి ఏపీలో ఎంతో మంది ముఖ్యమంత్రులు నేతన్నల కష్టాలను, వారి బలవన్మరణాలను రాజకీయాలకు వాడుకున్నారే తప్ప, ఏనాడూ ఆదుకోలేదు. సిరిసిల్ల నేతన్నల సంక్షేమం కోసం కృషి చేసిన పాలకుడు కేసీఆర్ మాత్రమే. నేతన్నల సమస్యలపై పూర్తిగా అవగాహన ఉన్న కేసీఆర్ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం కొలువయ్యాక స్థానిక ఎమ్మెల్యే, మంత్రి హోదాలో కేటీఆర్ వారి ఆకలిచావులను, ఆత్మహత్యలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సిరిసిల్ల నేత పరిశ్రమను కుటీర పరిశ్రమగా గుర్తించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఆయన కృషి ఫలితంగా 2006 నుంచి పేరుకుపోయిన విద్యుత్తు బకాయిలపై ప్రభుత్వం 50 శాతం రాయితీ ప్రకటించింది. దాంతో నేత పరిశ్రమ కష్టాల సుడిగుండం నుంచి బయటపడింది. అంతేకాదు, నేత కార్మికుల కుటుంబాలకు 35 కిలోల బియ్యం ఉచితంగా ఇచ్చేలా అంత్యోదయ కార్డులను ఇచ్చింది. స్త్రీలకు పావలా వడ్డీకే రుణాలను అందజేసింది. స్త్రీ స్వయం శక్తి పొదుపు సంఘాలను ప్రోత్సహించింది.దనేతన్న బీమా, పెన్షన్ వర్కర్ టు ఓనర్ మొదలైన సంక్షేమ పథకాలను అమలు చేసింది. రూ.350 కోట్ల విలువైన బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చింది. అంతేకాకుండా రాజీవ్ విద్యా మిషన్ పాఠశాల యూనిఫాంలు, క్రైస్తవులు, ముస్లిం సోదరులకు ఇచ్చే వస్త్రాలను కూడా సిరిసిల్ల పరిశ్రమకే ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు రూ.3,313 కోట్ల విలువైన పని కల్పించి, వారి ఆదాయాన్ని రూ.20 వేలకు పెరిగేలాచేసాడు. తద్వారా నేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలిచావులు పూర్తిగా తగ్గిపోయాయి. కాని దుష్ప్రజా పాలన వచ్చి బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి, ఇతర ఆర్డర్లను దళారులకు కట్టబెట్టి నేతన్నల ఉపాధిని దెబ్బతీసింది. 'నేతన్నల బకాయిలు రూ.60 కోట్లు ఎప్పుడు చెల్లించడంలేదు నిలిపివేసిన 10% యార్న్ సబ్సిడీ, 5.5 లక్షల నేతన్న బీమాకు ఎగనామం పెట్టింది. గత బిఆర్ఎస్ పాలనలో ప్రారంభించిన వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్ కార్మికులను యజమానులుగా మార్చే ప్రణాళికలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. అత్యాధునిక ధోబిఘాట్, అంతర్జాతీయ ప్రమానాలుగల అపరెల్ పార్కును స్థాపించారు అందు ఐదు వేలనుంచి ఎనమిదివేలకు పైగా మహిళలు ఉపాది పొందుతున్నారు అంతేకాకుండా తెలంగాణ లోనే మోట్టమొదటగా అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ నెలకొలిపారు దానితో ఏంతోమంది చోదకులు అంతర్జాతీయంగా ఉపాది పొందుతున్నారు మరియు కేటీఆర్ గారి నాయకత్వంలో పది సంవత్సరాలుగా సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధి రాజకీయాలకతీతంగా విద్యా వైద్యం ఉపాధి తదితర రంగాల్లో తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచింది. సిరిసిల్ల కార్మిక క్షేత్రంలో 30 వేల పవర్ రూం లు ఉండగా వాటిలో 15 వేల వరకు కాటన్ బటన్ ఉత్పత్తి చేస్తే మిగతా 15 వేల పవర్ రూం లు పాలిస్టర్ వస్త్రాన్ని ఉత్పత్తి చేసేవి కాటన్ బట్టల పరిశ్రమకు అనుబంధంగా 26 సైజ్లింగ్ లు 130 వరకు చిన్న తరహా డయింగ్ యూనిట్ లు మనుగడ సాగిస్తున్నాయి. అంతేకాకుండా సుమారు 3000 మంది కార్మికులు ఆటో నడుపుతూ రవాణా హామాలీలుగా పని చేసేవారు. కేటీఆర్ విజన్ తో... ఆధునికతతో కూడి నాయకత్వ పటిమతో సిరిసిల్ల ప్రజల భవిష్యత్తు కనుగుణంగా పట్టణాన్ని అన్ని రకాలుగా అన్ని రంగాల్లో అద్భుతంగా తీర్చిదిద్దారు. కేటీఆర్ ప్రత్యేక చొరవ మేరకు నేతన్న బీమా పెన్షన్ వర్కర్ టు ఓనర్ మొదలైన సంక్షేమ పథకాలను అమలు చేసింది. బతుకమ్మ చీరలు ఆర్డర్లు ఇచ్చింది. ఇలాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాల వల్ల సిరిసిల్లలోని నేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు పూర్తిగా మాయమయ్యాయి. ఇలాంటి సందర్భంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటన రాజకీయ దురుద్దేశంతోనే ఉందని ప్రజలు భావిస్తున్నారు. కెసిఆర్ కేటీఆర్ ను వ్యక్తిగతంగా విమర్శించాలనే ఉద్దేశంతోనే రేవంత్ పర్యటన కొనసాగుతుందని అది ఏమాత్రం సరి కాదని ప్రజలు సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. కేవలం అవినీతి మరకలు వేసి అక్రమ సంపాదన పేరుతో కేటీఆర్ రాజకీయ మనగడపై ఇబ్బంది పెట్టాలని ఉద్దేశంతోనే రేవంత్ పర్యటన ఉందని సిరిసిల్ల ప్రజలు అనుకుంటున్నారు. ఇలాంటి ఎన్ని రాజకీయ శక్తులు కలిసినా సిరిసిల్ల ప్రజలు ఎప్పటికీ కేటీఆర్ కె మద్దతు ఇస్తారని కేటీఆర్ నాయకత్వాన్నే సమర్థిస్తారని ప్రజలు భావిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ నాయకత్వ ప్రతిభతో కేసీఆర్ ను మళ్ళీ సీఎం గా చూడాలని రాష్ట్ర ప్రజలు బలంగానే నమ్ముతున్నారన్నది కాదనలేని సత్యమే..!

ఆర్ఆర్ఆర్